నేటి కందం- నేటికి అందం

మన కర్నాటక మందున
పనితన మొప్పారు రీతి పదుగురు మెచ్చన్
ఘనముగ నారంభించిరి
పొనరుగ జన్ జీ కి తగిన పోస్టాఫీసున్ !!

(కర్ణాటకలో యువజనుల కొరకు జెన్ జీ కి తగిన విధంగా అన్ని సౌకర్యాలతో పోస్టాఫీసు ప్రారంభించబడింది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటినిజం

తెలుగు దినపత్రిక

తప్పులను సరిదిద్దే
తెలంగాణ భూభారతి
వేలు లక్షలవినీతితో
వెల్లుతున్న ధన హారతి.
జనం లంచమిస్తే తప్ప
చేయబోరు ఏపనులు
సర్కారుకు రెవెన్యూలో
చెడ్డపేరు తెచ్చే ఘనులు

చురక

-వేల్పుల నారాయణ
9440433475



website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

హైదరాబాద్ బుధవారం 24-12-2025 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:111 పేజీలు:6 వెల: రూ.1/-


# నిరంతరాయ విద్యుత్ సరఫరాకు పటిష్ట చర్యలు..

## –డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు

## -13 వేల 500 కోట్లతో 96 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం పంపిణీ



ఖమ్మం,డిసెంబర్ 23:రైతులకు, ప్రజలకు పారిశ్రామికవేత్తలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. డిప్యూటీ సీఎం, ఆర్థిక, ఇంధన, ప్రణాళిక శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు ఇవాళ తల్లాడ మండలం పినపాక, అన్నారుగూడెం, కల్లూరు మండలం లింగాల గ్రామాల్లో 10 కోట్ల 53 లక్షల రూపాయల అంచనాతో చేపట్టిన మూడు 33/11 కె.వి. సబ్ స్టేషన్ ల నిర్మాణ పనులకు ఎన్.పి.డి.సి.ఎల్. సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, వైరా ఎమ్మెల్యే రామ దాసు నాయక్ లతో కలిసి పినపాక గ్రామంలో శంకు స్థాపన చేశారు.

ఈసందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా సబ్ స్టేషన్ లను నిర్మించాలని, స్థానిక ఎమ్మెల్యే అందించిన ప్రతిపాదన మేరకు తల్లాడ మండలం పినపాక, అన్నారు గూడెం, కల్లూరు మండలం లింగాల మూడు గ్రామాల్లో సబ్ స్టేషన్లు మంజూరు చేసుకుని వాటి నిర్మాణ పనులకు భూమి పూజ చేసుకున్నామని తెలి పారు.

తల్లాడ, కల్లూరు మండలంలో ఉన్న రైతులకు, రైతు కూలీలకు, సామాన్యులకు ఎవరికైనా విద్యుత్ చాలా కీలకమన్నారు. వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా ఉంటే మంచి పంటలు పండుతాయని, సబ్ స్టేషన్ నిర్మాణం ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందన్నారు. పేద ప్రజలకు ప్రభుత్వం 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుందని, సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలో 55 వేల 588 కుటుంబాలకు గృహజ్యోతి పథకం కింద ఉచిత విద్యుత్ సరఫరా చేస్తున్నామని, ప్రభుత్వం ఇప్పటివరకు పేదలు, రైతుల తరపున 123 కోట్ల రూపాయలను విద్యుత్ సంస్థకు చెల్లించడం జరిగిందన్నారు.

ప్రజా ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరుతున్నాయని, దీని ఫలితంగా ఇటీవల నిర్వహించిన పంచాయతీ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో తాము గెలుపొందామని డిప్యూటీ సీఎం తెలిపారు. గతంలో ప్రతిపక్షం తరపున తాను ప్రజా సమస్యలపై అసెంబ్లీ వేదికగా అప్పటి ప్రభుత్వాన్ని ప్రశ్నించడం జరిగిందని, ఒక రోజు కూడా సభకు గైర్హాజరు కాలేదని, ప్రస్తుత ప్రధాన ప్రతిపక్ష నేత అసెం బ్లీకి రాకుండా తన కర్తవ్యాన్ని నెరవేర్చడంలో నిర్లక్ష్యంగా ఉన్నారని డిప్యూటీ సీఎం విమర్శిం చారు.

గత ప్రభుత్వం పాటించిన విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పూర్తిస్థాయిలో ధ్వంసమైనప్పటికీ ప్రజా ప్రభుత్వం మహిళా సంఘాలకు 26 వేల కోట్ల రూపాయల వడ్డీలేని రుణాలు పంపిణీ చేశామన్నారు. 96 లక్షల కుటుంబాలకు 13 వేల 500 కోట్లు ఖర్చు చేస్తూ నాణ్యమైన సన్న బియ్యం రేషన్ షాపుల ద్వారా పంపిణీ చేస్తున్నామన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పేరుతో ప్రజలను గత పాలకులు మోసం చేస్తే, మన ప్రజా ప్రభుత్వం 22 వేల 500 కోట్లు ఖర్చు చేస్తూ ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 3500 ఇండ్ల చొప్పున మొత్తం 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసినట్లు డిప్యూటీ సీఎం తెలిపారు. పేద ప్రజలు ఆత్మ గౌరవంతో ఉండేలా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు.

ప్రతి సంవత్సరం రైతుల పక్షాన 12 వేల 500 కోట్ల రూపాయలు రైతుల తరపున విద్యుత్ శాఖకు చెల్లిస్తూ 24 గంటల పాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నా మని, నిరుపేదలకు రేషన్ కార్డులు, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతు న్నదని, దీనిని గమనించిన ప్రతిపక్ష నాయకులు అసత్య ప్రచారాలు చేస్తూ విషం కక్కుతు న్నారని, దీని పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూ టీ సీఎం పిలుపునిచ్చారు.

సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పేద ప్రజలకు గృహ అవసరాల కోసం 200 యూనిట్లు, రైతులకు వ్యవసాయ పనుల నిమిత్తం 24 గంటలు, ప్రభుత్వ విద్యా సంస్థలకు ఉచితంగా విద్యుత్తు సరఫరా చేస్తున్నామన్నారు. పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ దృష్ట్యా సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు రావద్దని 33/11 కేవీ సబ్ స్టేషన్ లను నిర్మిస్తున్నామన్నారు. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, విద్యుత్ శాఖ ఎస్ఇ ఇనుగుర్తి శ్రీనివాసా చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకొబ్, ఇర్రిగేషన్ ఎస్ఇ ఎం. వెంకటేశ్వర్లు, కల్లూరు ఏసీపీ వసుంధర యాదవ్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్కార్ కీలక నిర్ణయం..

హైదరాబాద్, డిసెంబర్ 23: తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ రాజకీయాల్లో మరో సంచలన నిర్ణయం తీసుకుంది. ఉప సర్పంచులకు ఇప్పటి వరకు ఉన్న 'జాయింట్ చెక్ పవర్'ను పూర్తిగా రద్దు చేస్తూ పంచాయతీరాజ్ శాఖ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయం గ్రామ స్థాయి రాజకీయాల్లో పెద్ద ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇప్పుడిప్పుడే ఎన్నికై, తమ పదవిలో చక్రం తిప్పాలని ఆశపడిన వేలాది మంది ఉప సర్పంచులకు ఈ నిర్ణయం గట్టి ఎదురుదెబ్బగా మారింది. గ్రామ పంచాయతీ నిధుల వినియోగంలో ఉప సర్పంచులకు ఉన్న జాయింట్ చెక్ పవర్ ను రద్దు చేస్తూ ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.

రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల ముగిసిన పంచాయతీ ఎన్నికల తర్వాత కొత్త పాలకవర్గాలు కొలువుదీరాయి. చాలా గ్రామాల్లో సర్పంచ్ పదవికి , ఉప సర్పంచ్ పదవికి తీవ్రమైన పోటీ నెలకొంది. ప్రత్యేకించి ఉప సర్పంచ్ పదవి పొందితే.. నిధుల వినియోగంలో తమ సంతకం కూడా కీలకం అవుతుందని, తద్వారా గ్రామంలో తమ పలుకుబడి పెరుగుతుందని చాలా మంది వార్డు సభ్యులు భావించారు.

# పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో దారుణం

## -7వ తరగతి విద్యార్థిపై 10వ తరగతి విద్యార్థులచే కొట్టిన్చిన ప్రిన్సిపాల్

కొంపల్లి డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: హైదరాబాద్ లోని పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో దారుణం వెలుగులోకి వచ్చింది. తన మాట వినడం లేదని ఓ విద్యార్ధిని 10వ తరగతి విద్యార్ధులతో విచక్షణారహితంగా ప్రిన్సిపాల్ కొట్టించాడు. కొంపల్లి ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి విద్యార్థి సూర్యను 10వ తరగతి విద్యార్థులు చితకబాదారు. తన మాట వినడం లేదని సూర్యను 10వ తరగతి విద్యార్థులతో విచక్షణా రహితంగా దుండిగల్ ఇంచార్జ ఎంఇఒ, కొంపల్లి పాఠశాల ప్రిన్సిపాల్ కృష్ణ కొట్టించినట్టు తల్లిదండ్రులు ఆరోపణలు చేస్తున్నారు. బాధిత విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉద్యోగుల సమస్యలపై స్పెషల్ ఫోకస్..

## – సీఎం రేవంత్‌రెడ్డి కీలక ఆదేశాలు



హైదరాబాద్, డిసెంబర్ 23:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి (ఎవశ్రీజీనిణజీనిజీ అఓ ఖీవలజీనిబిష్ఠ ఖీవటటఎ) అన్ని శాఖల ఉన్నతాధికారులతో ఇవాళ(మంగళవారం) సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఆయా శాఖల్లో పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించారు. శాఖల మధ్య సమన్వయంపై కీలక సూచనలు చేశారు.

ప్రతీ సెక్రటరీ వారి వారి శాఖల్లో ఉన్న రెగ్యులర్, ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులకు సంబంధించి పూర్తి వివరాలు జనవరి 26వ తేదీలోగా సీఎస్‌కు అందించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు అందాల్సిన జీతాలు, ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం అందుతున్నాయో లేదో సంబంధిత శాఖల హెచ్‌వోడీలు వెరిఫై చేయాలని సూచించారు సీఎం రేవంత్‌రెడ్డి.

ఈ ప్రక్రియను జనవరి 26వ తేదీలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో ఉండకూడదని ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని స్పష్టం చేశారు. జనవరి 26వ తేదీలోపు అద్దె భవనాల్లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలను వెంటనే ఖాళీ చేసి ప్రభుత్వ భవనాల్లోకి మారాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.

'ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయింది. ఈ రెండేళ్లలో కొన్ని విజయాలు సాధించాం. కొన్ని ప్రణాళికలు రూపొందించుకున్నాం. గతంలో ఎనర్జీ, ఎడ్యుకేషన్, ఇరిగేషన్, హెల్త్ లాంటి వివిధ శాఖలకు సంబంధించి ఒక పాలసీ లేకపోవడంతో కొన్ని సమస్యలు వచ్చాయి. అందుకే ముఖ్యమైన విభాగాలకు ఒక పాలసీని తీసుకున్నాం. రాష్ట్రానికి ఒక పాలసీ ఉండాలని తెలంగాణ రైజింగ్ -2047 విజన్ డాక్యుమెంట్‌ను విడుదల చేశాం. రాష్ట్రాన్ని క్యూర్ ప్యూర్ రేర్ గా విభజించి అభివృద్ధికి ప్రణాళికలు రూపొందిస్తున్నాం. స్పష్టమైన విధి విధానాలతో మేము ముందుకు వెళుతున్నాం' అని వ్యాఖ్యానించారు సీఎం రేవంత్‌రెడ్డి.

'ఎంత గొప్ప కార్యాచరణ తీసుకున్నా అధికారుల సహకారం ఉండాలి. అధికారులు జవాబుదారీతనంతో పని చేయాలి. ప్రతీ నెల కార్యదర్శుల పనితీరుపై సీఎస్ సమీక్షిస్తారు. కార్యదర్శులు సీఎస్‌కు ప్రతీ నెల రిపోర్ట్ సమర్పించాలి. ప్రతీ మూడు నెలలకు ఒకసారి మీ పనితీరుపై నేనే స్వయంగా సమీక్షిస్తా. ఆయా శాఖల మధ్య, అధికారుల మధ్య సమన్వయం లేకపోతే ఎలాంటి ఫలితాలు రావు. అధికారులు సమన్వయం చేసుకుని పనిచేయడం అత్యంత కీలకం. తెలంగాణ అభివృద్ధి విషయంలో శాఖల మధ్య సమన్వయం చేసుకునేందుకు ఒక మెకానిజం ఏర్పాటు చేసుకోవాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

# ఎవొబిలో మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ

## – మరో 22 మంది నక్సల్స్ లొంగుబాటు

ఒడిశా డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );మావోయిస్టు పార్టీకి ఎవొబిలో మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన మరో 22 మంది నక్సల్స్ లొంగిపోయారు. ఒడిశా మల్కాన్‌గిరి జిల్లాలో ఆ రాష్ట్ర డిజిపి ఎదుట ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మావోయిస్టుల వద్ద ఉన్న 14 ల్యాండ్‌మైన్లను పోలీసులకు అప్పగించారు. వీరందరిపై కలిపి రూ. 2.18 కోట్ల రివార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. మార్చి 2026 నాటి దేశంలో నక్సలైట్లు లేకుండా చేస్తానని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో సాయుధ బలగాలు ఆపరేషన్ కగార్, ఆపరేషన్ కర్రెగుట్ట పేరుతో నక్సల్స్‌పై విరుచుకుపడుతున్నాయి. దీంతో పెద్ద ఎత్తున మావోయిస్టులు ఎన్‌కౌంటర్‌లో మరణిస్తున్నారు. అదే స్థాయిలో పోలీసుల ఎదుట లొంగిపోతున్నారు. ఈ నేపథ్యంలో మావోయిస్టు పార్టీ భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి.

# తుది గడువు డిసెంబర్ 29

## –సీడబ్ల్యూసీ కమిటీల్లో దరఖాస్తులకు అవకాశం

అమరావతి, డిసెంబర్ 23:ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు, వీధి బాలల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏపీలోని 26 జిల్లాల్లో చైల్డ్ వెల్ఫేర్ కమిటీలలో చైర్ పర్సన్లు, సభ్యులు, జువెనైల్ జస్టిస్ బోర్డులలో సోషల్ వర్కర్ సభ్యులుగా పనిచేయడానికి అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది.

ఈ దరఖాస్తులను సమర్పించడానికి గతంలో నిర్ణయించిన గడువు డిసెంబర్ 22, 2025 తో ముగిసింది. అభ్యర్థుల సౌకర్యార్థం ఈ గడువును 29.12.2025 వరకు పొడిగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ద్వారా మాత్రమే సమర్పించాలన్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు పైన పేర్కొన్న వెబ్‌సైట్‌ను సందర్శించి 29. 12.2025 లోపుగా దరఖాస్తు చేసుకోవాలని కోరడమైనది. బాలల సంక్షేమం, సంస్కరణల సేవలు వీధి బాలల సంక్షేమ శాఖ సంచాలకులు ఎమ్. వేణు గోపాల్ రెడ్డి ఈ మేరకు ప్రకటన జారీ చేశారు.

# ఘనంగా 'అటల్ జీ స్మృతి సమ్మేళనం'

హైదరాబాద్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);భారత సాంస్కృతిక మంత్రిత్వ శాఖ సహకారంతో త్రినేత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి శత జయంతి సందర్భంగా.. హైదరాబాద్‌లోని నారాయణగూడలో 'అటల్ జీ స్మృతి సమ్మేళనం'ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రధాన అతిథులుగా భారత మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు , మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ , రాజ్యసభ సభ్యులు మరియు బిజెపి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డా. కె. లక్ష్మణ్ , ఎమ్మెల్సీలు అంజిరెడ్డి , మల్క కొమురయ్య , తదితర నాయకులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ప్రధానంగా అటల్ బిహారీ వాజ్‌పేయి జీవితం, ప్రజాస్వామ్య స్ఫూర్తి, నాయకత్వం, విలువలుపై ప్రసంగాలతో పాటు అర్థవంతమైన చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు మాట్లాడుతూ సాధారణంగా ప్రజాప్రతినిధులు, నాయకులు శాసనసభలలో వాదనలు, విభేదాలు జరిపే అవకాశం ఉంటుంది. అయినప్పటికీ, సభ వెలుపల వ్యక్తిగత శత్రుత్వాలను పక్కన పెట్టి ముందుకు సాగడం అత్యంత అవసరం. దురదృష్టవశాత్తు, గతంలో ఒక ఎమ్మెల్యే మరో ఎమ్మెల్యేను గేట్ వద్ద కొట్టిన సంఘటనలను మనం చూశాం. అలాంటి ఘటనలు ఎప్పుడూ సమర్థించదగినవి కావు. అలాగే, జయలలిత గారిని అసెంబ్లీ లోపలే దారుణంగా అవమానించిన సంఘటన మనందరికీ గుర్తుంది. ఆ దురదృష్టకరమైన ఘటన ద్రౌపది వస్త్రాపహరణం దృశ్యాన్ని తలపించింది. ఇలాంటి ఘటనలు ప్రజాస్వామ్యంలో జరగకూడదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడడం, దాన్ని ముందుకు నడిపించిన విషయంలో మనకు ఆదర్శంగా తీసుకోవాల్సిన నాయకుడు భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి అని అన్నారు. నేను ఎమ్మెల్సీగా ఉన్నప్పుడు కౌన్సిల్‌లో, ముఖ్యమంత్రి గారితో సహా, "ప్రతిదీ ఫ్రీ" అనే విధానం ప్రమాదకరమని స్పష్టం చేశాను. ఈరోజు చాలా ప్రభుత్వాల వద్ద ఉద్యోగులకు జీతాలు ఇవ్వడానికి కూడా నిధులు లేవు. రిటైర్మెంట్ అయిన ఉద్యోగులకు పెన్షన్లు ఇవ్వలేని పరిస్థితులు వస్తున్నాయి. కొందరు పెన్షనర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు, మరికొందరు రోడ్లపైకి వచ్చి భిక్ష అడిగే స్థితి ఏర్పడుతోంది. ఇది చాలా బాధాకరం. అందుకే ప్రభుత్వాలు ఆదాయం – ఖర్చు మధ్య సమతుల్యత పాటించాలి. రెవెన్యూ, ఎక్స్పెండిచర్ మధ్య సమతుల్యత అవసరం. వెల్ఫేర్ ప్రోగ్రామ్స్‌తో పాటు డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్స్ కూడా సమానంగా అమలు చేయాలి. ఈ సమతుల్యతను సాధించిన నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి . అందుకే వాజ్‌పేయి గారి జయంతిని 'గుడ్ గవర్నెన్స్ డే'గా దేశం మొత్తం జరుపుకుంటోంది. ఈరోజు మనం రాజకీయాల్లో భాషా ప్రయోగం ఎంత దూరం వెళ్ళిందో గమనించాలి. వ్యక్తిగత విమర్శలను మించి, విధాన పరమైన విమర్శలు, సైద్ధాంతిక చర్చలను కొంతమంది మర్చిపోయారు. ఏదైనా వాదనలతో మాట్లాడితే కూడా బూతుల వంటి వ్యాఖ్యలు చేస్తున్న ఘటనలను చూస్తు న్నాం. అందుకే ప్రజాస్వామ్య పద్ధతిలో నిజమైన డిబేట్, చర్చలు, ప్రజాస్వామ్య విలువలను గౌరవించడం తప్పనిసరి అని అన్నారు. కొందరు పార్టీ సిద్ధాంతాలను విమర్శించవచ్చు, విధానాలను ప్రశ్నించవచ్చు, కానీ వ్యక్తిగత విమర్శలు చేయకూడదు.

# ప్రియుడితో కలిసి భర్తను చంపి గ్రైండర్‌లో ముక్కలుగా చేసి...

లక్నోడిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ప్రియుడితో కలిసి భర్తను చంపి గ్రైండర్‌లో ముక్కలుగా చేసి శరీర భాగాలను మురిక కాలువలో పడేసింది. ఈ సంఘటన ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం సంభాల్ ప్రాంతంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చందౌసిలోని మొహల్లా చున్నీలో రాహుల్, రుబీ అనే దంపతులు నివసిస్తున్నారు. గౌరవ్ అనే వ్యక్తితో రుబీ వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ విషయం భర్తకు తెలియడంతో పలుమార్లు భార్యను మందలించాడు. అక్రమ సంబంధం విషయంలో దంపతుల మధ్య గత కొన్ని రోజుల నుంచి గొడవలు జరుగుతున్నాయి. వివాహేతర సంబంధానికి భర్త అడ్డుగా ఉండడంతో తొలగించుకోవాలని నిర్ణయం తీసుకుంది. నవంబర్ 18న భర్తను తన ప్రియుడితో కలిసి ఇనుప రాడ్‌తో కొట్టి చంపారు. అనంతరం మృతదేహాన్ని గ్రైండర్‌లో వైసి ముక్కలు ముక్కలు చేశారు. ఈడ్గాలోని మురికి కాలువలో శరీర భాగాలను పడేశారు. మరికొన్ని శరీర భాగాలు రాజ్‌ఘాట్‌లోని గంగా నదిలో పడేశారు. తన భర్త కనిపించడంలేదని అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్‌లో భార్య ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈడ్గాలోని మురికి కాలువలో డిసెంబర్ 15న శరీర భాగాలు కనిపించడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక శరీర భాగంపై రాహుల్ పేరు ఉండడంతో పోలీసులు లోతుగా దర్యాప్తు ప్రారంభించారు. రాహుల్ భార్య రూబీని అదుపు లోకి తీసుకొని ప్రశ్నించారు. కుళ్లిపోయిన శరీర భాగాలకు డిఎన్ఎ పరీక్షలు చేయించారు. రాహుల్‌దే మృతదేహం అని గుర్తించారు. రూబీని అదుపు లోకి తీసుకొని తనదైన శైలిలో ప్రశ్నించడంతో నిజాలు బయట కు వచ్చాయి. తన ప్రియుడు గౌరవ్‌తో కలిసి హత్య చేశానని ఒప్పుకుంది. వెంటనే ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

# ఊబచెరువు లో చేప పిల్లల విడుదల చేసిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సదాశివపేట డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );సదాశివపేట పట్టణం లోని ఊబ చెరువు లో మంగళవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి , మత్స్య సహకార శాఖ మంత్రి వాకిటి శ్రీహరి నేతృత్వం లో రాష్ట్రం లో మత్స్య పరిశ్రమ అభివృద్ధికి, పరిశ్రమ పై ఆధార పడ్డ కులాల అభివృద్ధి కోసం ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. భవిష్యత్ లో మత్స్య పరిశ్రమ పై ఆధారపడ్డ కులాలకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాల అమలు కోసం ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.




# వినియోగదారుల హక్కులతో సామాజిక న్యాయం !

## (24 డిసెంబర్ "జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం" సందర్భంగా)

ప్రపంచంలో నేడే జన్మించిన శిశువు నుంచి పండు ముసలి వరకు ప్రతి ఒక్కరు వినియోగదారుడే. వినియోగదారుడే వ్యాపారానికి కేంద్ర బిందువు. నేటి డిజిటల్ యుగంలో ఈ-వ్యాపారాలు పెరుగుతున్న వేళ వినియోగదారులు అప్రమత్తంగా ఉండవల్సిన అగత్యం ఏర్పడింది. ఒక వస్తువును కొన్నపుడు లేదా అమ్మినపుడు సరైన న్యాయం పొందడం కనీస అవసరం. 1960ల నుంచే వినియోగదారుల చైతన్య ఉద్యమాలు ప్రారంభం కావడం, దినదినం తీవ్ర రూపం దాల్చడం, వినియోగదారుల మండలి/ఫోరంలు ఏర్పడడం, వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టాలు రావడం గమనిస్తున్నాం.

### చట్టం కల్పించిన వినియోగదారుల హక్కులు:

వినియోగదారులకు చట్టం కొన్ని నిర్దిష్టమైన హక్కులను కల్పించింది. సంరక్షణ హక్కు (రైట్ టు సేఫ్టీ), సమాచార హక్కు (రైట్ టు ఇన్ఫర్మేషన్), ఎంపిక హక్కు(రైట్ ఛూజ్), వివరణ పొందే హక్కు(రైట్ టు బి హర్డ్), పిర్యాదుల పరిష్కార హక్కు(రైట్ టు సీక్ రిడ్రెస్సల్), వినియోగదారుల విద్య హక్కు(రైట్ టు కన్స్యూమర్ ఎడ్యుకేషన్) అనబడే ఆరు హక్కులను భారత వినియోగదారుల పరిరక్షణ చట్టం, 1986 కల్పించడం హర్షదాయకం. వినియోగదారులకు సంబంధించిన అతి ముఖ్యమైన ఈ చట్టం 24 డిసెంబర్ 1986న పార్లమెంట్ ద్వారా చేయబడిన సందర్భాన్ని పురస్కరించుకొని ప్రతి ఏట 24 డిసెంబర్‌న దేశవ్యాప్తంగా "జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం (నేషనల్ కన్స్యూమర్ రైట్స్ డే)" పాటించుట ఆనవాయితీగా మారింది. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం-2025 ఇతివృత్తంగా "సుస్థిర జీవనశైలి వైపు అడుగులు (ఏ జెస్ట్ ట్రాన్సిషన్ టు సస్టేనబుల్ లైఫ్ స్టైల్స్)" అనబడే అంశాన్ని తీసుకొని ప్రచారం చేయడం జరుగుతోంది.

### వినియోగదారుల చైతన్య ఉద్యమాలు:

వినియోగదారుల దోపిడీ, స్వార్థపరమైన వ్యాపారుల అనైతిక విక్రయ పద్ధతులు, వినియోగదారుల అభిరుచులను తమకు అనుకూలంగా మార్చుకోవడం, మోసపోయిన వినియోగదారులకు తిరిగి న్యాయం అందించడం, జరిగిన నష్టానికి/అసౌకర్యానికి పరిహారం పొందడం, అనారోగ్యకర వ్యాపార పద్ధతులను అరికట్టడం, అవసరమైనపుడు వినియోగదారుల ఫోరం/మండలిని ఆశ్రయించడం లాంటి వెసులుబాట్లను వినియోగదారులకు చట్టం కల్పించడం ముదావహం. జాతీయ వినియోగదారుల హక్కుల దినం వేదికగా పలు ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు విద్యాలయాలు, పౌర సమాజంలో వినియోగదారుల హక్కుల పట్ల కార్యశాలలు/సెమినార్లు/అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు.

### వినియోగదారులు పరిహారం లేదా న్యాయం పొందే వేదికలు:

వినియోగదారుల హక్కులకు భంగం కలిగినపుడు మూడు అంచెల వ్యవస్థ కలిగిన పరిహార మార్గాలను చట్టం కల్పించింది. పరిహార విలువ ఒక కోటి రూపాయల లోపు ఉన్నపుడు జిల్లా స్థాయి వినియోగదారుల వివాదాల పరిహార కమిషన్‌కు పిర్యాదు చేయడం, రూ: 1 నుంచి రూ: 10 కోట్ల వరకు రాష్ట్ర వినియోగదారుల వివాదాల పరిహార కమిషన్‌కు, రూ: 10 కోట్లు దాటితే జాతీయ వినియోగదారుల వివాదాల పరిహార కమిషన్‌కు పిర్యాదులు చేసి ఉచితంగా న్యాయం పొందవచ్చు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, 1986 తర్వాత కొన్ని సవరణలతో మరో వినియోగదారుల హక్కుల పరిరక్షణ చట్టం, 2019ని తీసుకురావడంతో వినియోగదారుడికి న్యాయం జరగడానికి చట్టమే ఒక పదునైన ఆయుధంగా అందించడం జరిగింది. ఐరాస కూడా ప్రతి ఏట 15 మార్చిన "ప్రపంచ వినియోగదారుల హక్కుల దినం" పాటించుట కొనసాగుతున్న విషయం మనకు తెలుసు.

ప్రతి పౌరుడు ఒక వినియోగదారుడిగా తమ హక్కులను తెలుసుకొని, మోసపోకుండా, న్యాయబద్ధమైన సేవలను పొందడానికి అవసరమైన కనీస వినియోగదారుల అవగాహనను కలిగి ఉండాలి. మనల్ని మనమే చట్టం ద్వారా రక్షణ పొందుతూ అనైతిక వ్యాపార పోకడలకు అడ్డుకట్ట వేయాలి. వినియోగదారుల చైతన్య ఉద్యమాల ద్వారా సామాన్య జనాలకు వినియోగదారుల హక్కుల గూర్చి అవగాహన కల్పించాలి. వినియోగదారుడిని మన చట్టాలు శక్తివంతం చేసాయని, వాటి నీడన సురక్షితంగా జీవనయానం సాగించాలని కోరుకుందాం. అడుగడుగున అప్రమత్తతతో ఉందాం. నైతికత గీత దాటిన వ్యాపారవేత్తలకు లేదా కంపెనీలకు లేదా సేవలకు చట్ట తీవ్రతను పరిచయం చేద్దాం.

- ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# ఆయుష్ విధానాలను ప్రపంచ ఆరోగ్య ప్రమాణాలతో అనుసంధానించేందుకు

## న్యూఢిల్లీలో సమావేశమైన డబ్ల్యూహెచ్ఓ, ఆయుష్ మంత్రిత్వశాఖ



న్యూఢిల్లీ, డిసెంబర్ 23:సంప్రదాయ వైద్య విధానాలను ప్రపంచ ఆరోగ్య ప్రమాణాలతో అనుసంధానించే దిశగా ఒక కీలక అడుగు పడింది. దీనిలో భాగంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ డిసెంబర్ 20, 21 తేదీల్లో న్యూఢిల్లీలోని హోటల్ ఇంపీరి యల్‌లో సంప్రదాయ వైద్య విధివిధానాలపై రెండు రోజులపాటు సాంకేతిక ప్రాజెక్టు సమావేశాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి మే 24, 2025న ఆయుష్ మంత్రిత్వ శాఖ, డబ్ల్యూహెచ్ ఓ మధ్య కుదిరిన చారిత్రాత్మక అవగాహన ఒప్పందం, దాతృత్వ ఒప్పందం స్ఫూర్తిగా నిలిచాయి. ఆరోగ్య సేవలను వర్గీకరించడానికి ప్రపంచ వ్యాప్తంగా అనుసరించే ఇంటర్నేషనల్ క్లాసిఫికేషన్ ఆఫ్ హెల్త్ ఇంటర్వెన్షన్స్ (ఐసీహెచ్ఐ)లో సంప్రదాయ వైద్యానికి సంబంధించిన మాడ్యూల్‌ను అభివృద్ధి చేయడానికి ఈ ఒప్పందం కీలకంగా పనిచేయనుంది. ఆయుర్వేదం, సిద్ధ, యునానీ వైద్య విధానాలను ప్రపంచ ఆరోగ్య సంరక్షణ ప్రధాన వ్యవస్థలోకి తీసుకురావడానికి అవసరమైన ఆర్థిక, సాంకేతిక మౌలిక సదుపాయాలను కల్పించడంలో భారత్ కీలక పాత్ర పోషిస్తోంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికతకు అనుగుణంగా ఈ సమావేశాన్ని నిర్వహించారు. ఇలాంటి కార్యక్రమాలు ఆయుష్ వైద్య విధానాలను శాస్త్రీయ పద్ధతిలో ప్రపంచవ్యాప్తంగా గరిష్ట సంఖ్యలో ప్రజలను చేరుకునేందుకు సహాయపడతాయని ఆయన తెలిపారు. మన్ కీ బాత్ ప్రసంగంలో ప్రధానమంత్రి మాట్లాడుతూ.. ఈ ప్రమాణీకరించిన విధానం ఆయుష్ వ్యవస్థలకు అంతర్జాతీయ గుర్తింపు, శాస్త్రీయ విశ్వసనీయతను తెచ్చిపెడుతుందని పేర్కొన్నారు. అంతకముందు ఆయుష్ మంత్రిత్వ శాఖ కార్యదర్శి వైద్య రాజేష్ కొటేచా ప్రస్తావిస్తూ.. ప్రత్యేక ఐసీహెచ్ఐ మాడ్యూల్ ఏర్పాటుతో ఆయుష్ వ్యవస్థలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు లభిస్తుందని అన్నారు. సమగ్రమైన, సురక్షితమైన, ఆధారిత ఆరోగ్య సంరక్షణను ప్రోత్సహించేందుకు డబ్ల్యూహెచ్ఓ చేస్తున్న ప్రయత్నాలకు ఇది మద్దతుగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సాంకేతిక సమావేశాలకు ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి కవితా గార్గ్ అధ్యక్షత వహించారు. ఆమె నేతృత్వంలో భారత బృందం ఆయుర్వేదం, సిద్ధ, యునానీ వైద్యం కోసం జాతీయ ఆరోగ్య విధానా అభివృద్ధికి కృషి చేసింది. ఆమె మార్గదర్శకత్వంలో అనేక మంది నిపుణులు ఈ కార్యక్రమానికి తమ వంతు సహకారాన్ని అందించారు. వారిలో సీసీఆర్ఏఎస్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ రబినారాయణ ఆచార్య, సీసీఆర్ఎస్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ ఎన్.జె. ముత్తుకుమార్, సీసీఆర్‌యూఎమ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ జాహీర్ అహ్మద్ ఉన్నారు.

ఈ సమావేశంలో ప్రపంచ ఆరోగ్య సంస్థకు చెందిన ఆరు ప్రాంతాలైన ఏఎఫ్ఆర్ ఓ, ఏఎమ్ఆర్ఓ, ఈఎమ్ ఆర్ఓ, ఈయూఆర్ఓ, సీఈఏఆర్ఓ, డబ్ల్యూపీఆర్ఓ నుంచి విస్తృత స్థాయిలో ప్రతినిధులు పాల్గొన్నారు. ఇది సాంప్రదాయ వైద్యంపై సమగ్రమైన ప్రపంచ దృక్పథాన్ని అందించడానికి దోహదపడింది. జెనీవాలోని డబ్ల్యూహెచ్ఓ ప్రధాన కార్యాలయం ప్రతినిధులైన రాబర్ట్ జాకబ్, నెనాద్ కొస్తాంజ్‌సెక్, స్టెఫాన్ ఎస్పినోసా, డాక్టర్ ప్రదీప్ దువా వంటి కీలక ప్రతినిధులు వర్గీకరణ చర్చలకు నాయకత్వం వహించారు. వీరితోపాటు జామ్‌నగర్‌లోని డబ్ల్యూహెచ్ఓ ప్రపంచ సంప్రదాయ వైద్య కేంద్రానికి చెందిన డాక్టర్ గీతా కృష్ణన్, ఢిల్లీలోని డబ్ల్యూహెచ్ఓ సీఈఏఆర్ఓ ప్రాంతం నుంచి డాక్టర్ పవన్ కుమార్ గోడాత్వర్ కూడా పాల్గొన్నారు. భూటాన్, బ్రెజిల్, భారత్, ఇరాన్, మలేసియా, నేపాల్, మారిషస్, దక్షిణాఫ్రికా, శ్రీలంక, ఫిలిప్పీన్స్, యూకే, అమెరికా వంటి సభ్య దేశాలు ఈ సమావేశంలో పాల్గొని, తమ తమ దేశాల్లోని ప్రస్తుత పరిస్థితిని సమీక్షించడంతో పాటు, వైద్య విధానాలను పరస్పరం సమన్వయం చేసుకునే దిశగా చర్చించాయి.

సాంప్రదాయ వైద్యాన్ని ఐసీహెచ్ఐలో చేర్చడం అత్యంత కీలకం. ఎందుకంటే ఈ చికిత్సా విధానాలు వివిధ దేశాలు, వైద్య వ్యవస్థల మధ్య ఆరోగ్య ప్రక్రియలకు సంబంధించి ఒక సాధారణ పరిభాషను అందిస్తుంది. ఈ విధానాలను ప్రమాణీకరించడం ద్వారా ఆరోగ్య సేవలను అందించే వారు సంప్రదాయ చికిత్సల వినియోగం, అవి ఎంత తరుచు గ్గా అమలవుతున్నాయి, వాటి ప్రభావం ఎంత వరకు ఉందనే అంశాలను సరైన విధంగా నమోదు చేయడం, నివేదించడం, విశ్లేషించడానికి వీలవుతుంది. ఈ ప్రాజెక్టును ప్రపంచ ఆరోగ్య సంస్థ కచ్చిత మైన సమయపాలనతో పూర్తిగా శాస్త్రీయ దృక్పథాన్ని అవలంబి స్తూ అమలు చేయనుంది. ఇది కేవలం వైద్య పరిశోధనలకు, విధాన రూపకల్పనకు మద్దతివ్వడమే కాకుండా.. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న జాతీయ ఆరోగ్య సమాచార వ్యవస్థల్లో సాంప్రదాయ వైద్యాన్ని విస్తృతంగా అమలు చేసేందుకు మార్గాన్ని సుగమం చేస్తుంది.

# అదనపు సొలిసిటర్ జనరల్‌గా కనకమేడల రవీంద్రకుమార్

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: సుప్రీంకోర్టులో భారత ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే అదనపు సొలిసిటర్ జనరల్ పోస్టులకు మాజీ ఎంపీ కనకమేడల రవీంద్రకుమార్ తో పాటు దవీందర్‌పాల్ సింగ్‌ను కేంద్ర ప్రభుత్వం తాజాగా నియమించింది. కేంద్ర కేబినెట్ నియామకాల కమిటీ ఆమోదంతో న్యాయశాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

ఈ నియామకాలతో సుప్రీం కోర్టు లో కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించే లీగల్ టీమ్ మరింత బలోపేతమవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. కనకమేడల రవీంద్రకుమార్ గతంలో రాజ్యసభ ఎంపీగా పనిచేశారు. ఆయనకు విస్తృతమైన లీగల్ అనుభవం ఉంది. దవీందర్‌పాల్ సింగ్ కూడా సుప్రీంకోర్టులో పలు కీలక కేసుల్లో ప్రాతినిధ్యం వహించిన అనుభవజ్ఞుడు. ఈ నియామకాలు సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన కేసుల్లో బలమైన ప్రాతినిధ్యం అందించేందుకు దోహదపడతాయని న్యాయ నిపుణులు అభిప్రాయప డుతున్నారు.

# భారత్- న్యూజిలాండ్ మధ్య కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని ప్రశంసించిన కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి

న్యూఢిల్లీ, డిసెంబర్ 23:భారత్-న్యూజిలాండ్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ప్రశంసించారు. వాణిజ్య దౌత్యం విషయంలో మోదీ ప్రభుత్వం కొత్త మైలురాళ్లను నిర్దేశిస్తోందని ఆయన అన్నారు.

సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఈ విధంగా పేర్కొన్నారు "మోదీ ప్రభుత్వ వాణిజ్య దౌత్యం కొత్త మైలురాళ్లను నిర్దేశిస్తోంది.

సుమారు 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులను తీసుకువచ్చే భారత్-న్యూజిలాండ్ ఎఫ్‌టీఏ.. భారతీయ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలు, రైతులు, ఎంఎస్ఎంఈలు, విద్యార్థులు, యువతకు లాభదాయకమైన అవకాశాలను అందిస్తూ సంపదకు కొత్త ద్వారాలను తెరుస్తుంది. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలో పౌర కేంద్రీకృత విదేశాంగ విధానం ప్రజా ఆకాంక్షలను నెరవేర్చే తీరుకు ఒక 'మంచి ఉదాహరణ' "

# ఇదే సజీవ వారసత్వం



అమరావతి, డిసెంబర్ 23: ఆంధ్రప్రదేశ్ శాసన వ్యవస్థ ప్రచురించిన 2026 కేలెండర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆవిష్కరించారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం స్పీకర్ అయ్యన్న పాత్రుడుతో కలిసి ముఖ్యమంత్రి వాల్ కేలెండర్, టేబుల్ కేలెండర్, డైరీలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, శాసన పరిషత్ సెక్రటరీ జనరల్ ప్రసన్న కుమార్ సూర్యదేవర పాల్గొన్నారు.

జీవవైవిధ్యం ఆంధ్రప్రదేశ్ సజీవ వారసత్వం అనే థీమ్ తో ఈ కేలెండర్ రూపొందించారు. తూర్పు కనుమలు, విశాలమైన గడ్డి మైదానాలు, కోరింగా మడ అడవులు, సుదీర్ఘ బంగాళాఖాత తీరప్రాంతం ఇలా ఆంధ్రప్రదేశ్‌లోని విభిన్న ఆవరణ వ్యవస్థలకు చెందిన పన్నెండు వన్యప్రాణుల చిత్రాలతో కేలెండర్ తయారు చేశారు.

ప్రకృతి వారసత్వం, కళా సంప్రదాయం, ఆధునికతలను మేళవింపు చేశారు. సాంప్రదాయ కలంకారీ శైలిలో అత్యంత సుందరంగా చిత్రాలను తీర్చిదిద్దారు. ఈ చిత్రాలు రూపొందించేందుకు ఏఐని వినియోగించామని ప్రసన్న కుమార్ వివరించారు. 2026 సంవత్సర క్యాలెండర్‌ను చక్కగా డిజైన్ చేశారని సీఎం అన్నారు.

ప్రకృతిని కాపాడుకోవాలనే మంచి సందేశంతో క్యాలెండర్ ఉందని ప్రశంసించారు. పర్యావరణ పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ గురించి ఈ క్యాలెండర్ గొప్ప సందేశాన్ని ఇస్తోందని, అలాగే వాతావరణ మార్పుతో కలిగే పరిణామాలనూ వివరిస్తోందని అన్నారు. ప్రకృతిని కాపాడుకోవాలనే మన సమిష్టి బాధ్యతను ఈ కేలెండర్ గుర్తుచేస్తుందని అన్నారు.

స్పీకర్ అయ్యన్నపాత్రుడు అధ్యక్షతన వన్యప్రాణి, పర్యావరణ పరిరక్షణ కమిటీ ఉండటం సంతోషించాల్సిన విషయమని తెలిపారు. స్పీకర్ మాట్లాడుతూ?పర్యావరణం, వన్యప్రాణుల సంరక్షణ పట్ల శాసనసభకు ఉన్న నిబద్ధత, వన్యప్రాణులు, ప్రకృతిని కాపాడాల్సిన ఆవశ్యకతపై సమాజాన్ని చైతన్యపరిచేందుకు ప్రజాప్రతినిధుల సభ చేస్తున్న ప్రయత్నంగా 2026 కేలెండర్‌ను రూపొందించినట్లు స్పీకర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రి పయ్యావుల కేశవ్, శాసన వ్యవస్థ సెక్రటరీ- జనరల్ ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

# బోడం పహాడ్ సర్పంచ్, ఉపసర్పంచ్ లను ఘనంగా సన్మానం

రంగారెడ్డి జిల్లాడిసెంబర్ 23(ఎక్స్ ప్రెస్ న్యూస్ ).రంగారెడ్డి జిల్లాలో లోని బోడం పహాడ్ గ్రామంలో ఇటీవల జరిగిన పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన సర్పంచ్ కమలమ్మ చెన్నయ్య, ఉపసర్పంచ్ కళ్లెం శ్రీనివాస్ లను ప్రముఖ సంఘ సేవకుడు కాషా మొల్ల కృష్ణ, కొత్త పల్లి యాదయ్య తో కలిసి ఘనంగా సన్మానించారు. వీరితో పాటు వార్డ్ సభ్యులుగా గెలుపొందిన కే. చంద్రకళ, కే. సువర్ణ, ఎస్ రాఘవేంద్ర, కె లావణ్య, సి. శ్రీనివాస్, కె. కృష్ణవేణి, కె. ఆనంద్ లను వీరువురు ఘనంగా సన్మానించారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో ఉన్న సమస్యలు నా దృష్టికి తీసుకు వస్తే వెంటనే పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామభివృద్ధికి ప్రతి ఒక్కరు చేయూతను అందించాలన్నారు.

# బ్లాక్ మెయిల్ చేస్తున్న ముఠాను పట్టుకున్న కాచిగూడ స్టేషన్ హౌస్ ఆఫీసర్

## - సన్మానించిన ఈస్ట్ జోన్ డి సి పి. బాలస్వామి



హైదరాబాద్ డిసెంబర్ 22 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);బ్లాక్ మెయిల్ చేస్తున్న ముఠాను పట్టుకున్న కాచిగూడ స్టేషన్ హౌస్ ఆఫీసర్ ను ఈస్ట్ జోన్ డి సి పి. బాలస్వామి. సన్మానించారు.మూడు కమిషనరేట్ లలో ఆర్ టి సి ఉద్యోగులను బ్లాక్మెయిల్ చేస్తున్న ఘటన లో కీలక నిందితున్ని పట్టు కోవడంలో ముఖ్య పాత్ర పోషించిన కాచిగూడ ఇన్స్పెక్టర్ టి. జ్యోష్న ను ప్రశాంశ పత్రం తో పాటు రివార్డ్ ను అందించారు. ఈ కార్యక్రమంలో ఈస్ట్ జోన్ అదనపు డీసీపీ జోగుల నర్సయ్యా, సుల్తాన్ బజార్ ఏ సి పి. మత్తయ్య పాల్గొన్నారు.

# మెగా జాబ్ మేళా




నంద్యాల డిసెంబర్ 23: ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నేషనల్ కళాశాలలో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు అపూర్వ స్పందన లభించింది. తెలుగుదేశం పార్టీ రాష్ట్ర యువ నాయకులు ఎన్ఎండి ఫయాజ్, నేషనల్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ ఇంతియా అహ్మద్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మనియార్ ఖలీల్ లు పాల్గొని మాట్లాడారు.గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా ఈ మెగా జాబ్ మేళాను నిర్వహి స్తున్నామన్నారు. "ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు తలుపు తట్టినప్పుడు వాటిని వదులుకోకూడదన్నారు.యువత తమలో ఉన్న ప్రతిభను గుర్తించి, ఆత్మవిశ్వాసంతో ఇంటర్వ్యూలను ఎదుర్కోవాల న్నారు. "కేవలం డిగ్రీ పట్టాలు ఉంటే సరిపోదని, మారు తున్న సాంకేతికతకు అనుగుణంగా నైపుణ్యాలను (స్కిల్స్) మెరుగుపరుచుకోవాలన్నారు.ఇంతటి బృహత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభివృద్ధి సంస్థ నిర్వహించిన ఈ మెగా జాబ్ మేళాలో దాదాపు 22 కంపెనీలు 2100 ఉద్యోగాలకు పైగా ఉద్యోగ అవకాశాలు ఉన్నాయన్న రు. చదువుకున్న ప్రతి యువకుడికి, యువతికి ఒక గౌరవప్రదమైన ఉద్యోగం లభించాలనేది మా ఆశయ మన్నారు.విద్యార్థుల ముంగిటకే ఉద్యోగ అవకాశాలను తీసుకురావాలనే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ నైపుణ్య అభి వృద్ధి సంస్థతో ఈ 'మెగా జాబ్ మేళా'ను ఏర్పాటు చేశామ న్నారు .నేషనల్ విద్యాసంస్థలు కేవలం నాణ్యమైన విద్యకే కాకుండా, విద్యార్థుల కెరీర్ గైడెన్స్ మరియు ప్లేస్మెంట్స్ విషయంలో కూడా ఎప్పుడూ ముందుంటాయన్నారు ఈ కార్యక్రమంలో దూదేకుల ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దస్తగిరి, నంద్యాల మార్కెట్ యార్డ్ డైరెక్టర్ స్వామి నాయక్, కామిని మల్లికార్జున, దీపక్ రెడ్డి, నేషనల్ విద్యాసంస్థల సెక్రటరీ రఫీ అహ్మద్ , నేషనల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ వేణుగోపాల్, ప్లేస్మెంట్ అధికారి సాయికుమార్, మస్తాన్ వలి, మారుతి ప్రసాద్, కళాశాల అధ్యాపక బృందం , టిడిపి నాయకులు మరియు పెద్ద సంఖ్యలో నిరుద్యోగ యువతీ యువకులు పాల్గొన్నారు.

# అపాయింట్‌మెంట్లు వాయిదా..

## భారత్‌లో చిక్కుకుపోయిన వందలాది మంది హెచ్ 1 బి వీసాదారులు

న్యూ డిల్లీ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఈ నెల ప్రారంభంలో తమ వర్క్ పర్మిట్లను పనరుద్ధరించుకోవడానికి భారత్‌కు తిరిగి వచ్చిన వందలాది మంది హెచ్ 1 బి వీసాదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అమెరికా కాన్సులర్ కార్యాలయాలు ఇప్పటికే ఖరారైన అపాయింట్‌మెంట్లను వాయిదా వేశాయి. డిసెంబర్ 15 -26 మధ్య షెడ్యూల్ చేసిన అపాయింట్‌మెంట్లు వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి. దీంతో వర్క్‌పర్మిట్ల పునరుద్ధరణ కోసం భారత్‌కు వచ్చిన వందలాది మంది హెచ్-1బీ వీసాదారులు ఇక్కడే చిక్కుకుపోయారు. ఈ సమయంలో అమెరికాలో సెలవుల కావడం, యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ తీసుకొచ్చిన కొత్త సోషల్ మీడియా వెట్టింగ్ విధానం కూడా ఈ పరిస్థితి కారణంగా తెలుస్తోంది. ఈ మేరకు వాషింగ్టన్ పోస్ట్ ఓ కథనాన్ని వెలువరించింది. హెచ్-1బీ 'వెట్టింగ్'ా వాచ్-1బీ, హెచ్-4 వీసాల దరఖాస్తుదారుల సామాజిక మాధ్యమాల ఖాతాల ప్రాథమిక వడపోత, క్షుణ్ణమైన తనిఖీలను అమెరికా ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించిన విషయం తెలిసిందే. ట్రంప్ ప్రభుత్వం వలసలపై కొరడాను ఝుళిపిస్తున్న నేపథ్యంలో స్టేట్ డిపార్ట్‌మెంట్ ఈ నెల 3న జారీ చేసిన ఆదేశాల ప్రకారం ఈ తనిఖీలు జరుగుతున్నాయి. అమెరికన్ వీసాను పొందడం గొప్ప అవకాశమని, అది ఒక హక్కు కాదని ఈ ఆదేశాలు పేర్కొన్నాయి. అమెరికాలోకి అనుమతించదగని వారిని గుర్తించేందుకు లోతుగా తనిఖీలు చేస్తున్నారు. హెచ్-1బీ వీసా దరఖాస్తుదారులపై ఆధార పడినవారు హెచ్-4 వీసా కోసం దరఖాస్తు చేస్తారు. హెచ్-1బీ, హెచ్-4, ఎఫ్, ఎం, జే నాన్ ఇమిగ్రెంట్ వీసా దరఖాస్తుదారులందరూ తమకు గల అన్ని సామాజిక మాధ్యమాల ఖాతాల ప్రైవసీ సెట్టింగ్స్‌ను 'పబ్లిక్'కు మార్చాలని యూఎస్ స్టేట్ డిపార్ట్‌మెంట్ ఈ నెల 3న జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది. పూర్తి స్థాయి తనిఖీలు (వెట్టింగ్)లో అందుబాటులో ఉన్న అన్ని రకాల సమాచారాన్ని ఉపయోగించుకుని అమెరికాలోకి అనుమతించదగని వారిని గుర్తిస్తామని తెలిపింది. జాతీయ భద్రతలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నట్లు అగ్రరాజ్యం తెలిపింది.

# ఆదిత్యుని సన్నిధిలో చాగంటి



శ్రీకాకుళం, డిసెంబర్ 23: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం అరసవిల్లి లోని సూర్యనారాయణ స్వామి వారిని మంగళవారం ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు, భార్య సుబ్రహ్మణ్యేశ్వరి దేవాలయంనకు విచ్చేసి దర్శించుకున్నారు. ప్రత్యేక సూర్య నమస్కారాలు చేయించుకున్నారు. వారికి ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ, ఆలయ కార్యనిర్వాహణాధికారి కె ప్రసాద్ ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు, వేద పండితలు చాగంటి దంపతులను ఆశీర్వదించారు. వారికి స్వామి వారి ప్రసాదాలను,చిత్రపటం అందజేశారు.

# హార్ట్ ఫుల్ నెస్ మెడిటేషన్




అమరావతి, డిసెంబర్ 23:ఎపి సచివాలయంలో ఐఏఎస్ అధికారులు,ఇతర విభాగాల అధికారులు,సిబ్బందికి ఇన్నోవేటివ్ ప్రాక్టీసెస్ , ఇనీషియేటివ్స్ ,మెడిటేషన్ పై హైదరాబాదు రామచంద్ర మిషన్- కన్హా శాంతివనం హార్ట్ఫుల్నెస్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధి కమలేశ్ డి.పాటిల్ దాజీ బృందం మంగళవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈశిక్షణా కార్యక్రమంలో మెడిటేషన్ ఇతర ప్రక్రియలు వల్ల కలిగే ప్రయోజనాలు వాటిని ఆచరించాల్సిన విధానాలపై ఆయన వివరించండంతో పాటు సుమారు అర్ధ గంటపాటు అధికారులతో మెడిటేషన్ చేయించారు.

ధ్యానం ఇతర మూలచక్ర ప్రక్రియలు వాటి వల్ల కలిగే ప్రయోజనాలు గురుంచి వివరించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇటీవల హైదరాబాదులోని కన్హా శాంతివనాన్ని సందర్శించిన పిదప వారి విజ్ఞప్తి మేరకు ఇక్కడ ఈ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆసంస్థ నిర్వహకులు దాజీ పేర్కొన్నారు.

దైనందిన జీవితంలో ఐఏఎస్ అధికారులు సహా ఇతర అధికారులు,సిబ్బంది వారు విధి నిర్వహణలో ఎదుర్కొనే మానసిక ,శారీరక ఒత్తుడుల నుండి ఉప శమనం కలిగించేందుకు ధ్యానం ఎంతగానో దోహదపడుతుంది. అంతేగాక ప్రతి నిత్యం ధ్యానం ,యోగా వంటివి ఆచరించడం ద్వారా మానసిక,శారీక ఒత్తులను అధికమించి విధి నిర్వహణలో మరింత చురుగ్గా వేగవతంగా పని చేసేందుకు యోగా,ధ్యానం వంటి ప్రక్రియలు అన్ని విధాలా ఉపయోగపడతాయి.

రామచంద్ర మిషన్ అనేది ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఆసక్తిగల అన్వేషకులకు ఆధ్యాత్మిక శిక్షణను అందించే లాభాపేక్షలేని సంస్థ. సహజ్ మార్గ్ వ్యవస్థలో మూలాలను కలిగి ఉన్న హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానం ద్వారా ఇది హృదయ ఆధారిత మార్గంలో సమతుల్య జీవనానికి ఒక మార్గాన్ని అందిస్తుంది. కన్హా శాంతి వనంను హార్ట్ ఫుల్ నెస్ అంతర్జాతీయ ప్రధాన కార్యాలయంగా స్థాపించారు. హార్ట్ ఫుల్ నెస్ యోగా అకాడమీ, ట్రీ కన్జర్వేషన్ సెంటర్ మరియు వెల్‌నెస్ సెంటర్ వంటి కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

ప్రభుత్వాలు రైతుల సహకారంతో ఆయన చేపట్టిన హరిత కార్యక్రమాలు కన్హాను 800,000 చెట్లు అరుదైన జాతులకు నిలయంగా మార్చాయి. ఈకేంద్రంలో ధ్యాన తరగతులు,ఆన్‌లైన్ & ఆఫ్‌లైన్ సెషన్లు,మెడిటేషన్ వర్క్‌షాప్‌లు వంటివి నిర్వహిస్తుంటారు. కొత్త అభ్యాసుల కోసం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యానాన్ని పరిచయం చేయడానికి ఉద్దేశించబడింది. దీనిలో ధ్యానం,యోగా, కమ్యూనిటీ శిబిరం, ఖాళీ కాలం ఆలోచన కోసం వంటి సెషన్లు ఉంటాయి. ఈకార్యక్రమంలో పలువురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు,ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, శాఖాధిపతులు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ రైతు దినోత్సవం

యాదాద్రి డిసెంబర్ 23: యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ హైస్కూల్ ఐఐటి జోన్ లో జాతీయ రైతు దినోత్సవంను పుర స్కరించుకొని ఈ రోజు పాఠశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులకు రైతు వేషధారణ చేసి పంట పొలాల పనిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ట్రినిటీ హైస్కూల్ కరస్పాండెంట్ కం ప్రిన్సిపాల్ డాక్టర్ ఉజ్జిని మంజుల మాట్లాడుతూ విద్యార్థులకు రైతులు పండించే వివిధ రకాల పంటలు ఎలా పండుతాయో అవగాహన కల్పించారు.

విద్యార్థులకు రైతు వేషధారణ వేయించి నాగలి, ఎడ్లబండ్లు, వివిధ రకాల కూరగాయల ప్రదర్శన చేసి విద్యార్థులకు రైతులు చేసే పని గురించి, నీటిని పొదుపు చేసే ప్రక్రియ గురించి వివరించారు. విద్యార్థులు తినే ఆహారం వ్యర్థం చేయవద్దని తెలిపారు.

# సర్పంచ్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో విచిత్ర పరిస్థితి

### -ఇద్దరు అభ్యర్థులు గెలిచినట్లుగా ధ్రువీకరణ పత్రాలు.. తలలు పట్టుకున్న అధికారులు

మహబూబాబాద్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సర్పంచ్ ప్రమాణస్వీకార కార్యక్రమంలో విచిత్ర పరిస్థితి ఎదురైంది. ఎన్నికల్లో పోటీ చేసిన ఇద్దరు అభ్యర్థులు గెలిచినట్లుగా ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడంతో గందరగోళం నెలకొంది. ప్రమాణ స్వీకారానికి ఇద్దరు అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుని రావడంతో అధికారులు తలలు పట్టుకోవాల్సి వచ్చింది. మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం దామరవంచలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇటీవల విడుదలైన ఫలితాల్లో దామరవంచ గ్రామంలో బీఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థి స్వాతి మూడు ఓట్ల తేడాతో విజయం సాధించిందని తొలుత అధికారులు ప్రకటించారు. ఆమెకు గెలుపు ధ్రువీకరణ పత్రం కూడా అందజేశారు. అయితే స్వాతికి గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేసిన అరగంట తర్వాత కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థి సుజాత ఒక్క ఓటు తేడాతో గెలిచిందని ప్రకటిస్తూ ఎన్నికల రిటర్నింగ్ అధికారి మరోసారి ఫలితాన్ని వెల్లడించారు. సుజాతకు కూడా గెలుపు ధ్రువీకరణ పత్రం అందజేశారు. దీంతో ఇద్దరు అభ్యర్థులు కూడా ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు చేసుకున్నారు. తమ బంధువులు, సన్నిహితులను ఆహ్వానించారు. అయితే ప్రమాణస్వీకారానికి ఇద్దరు అభ్యర్థులు రావడంతో అధికారులు షాకయ్యారు. దీంతో ఎవరు నిజమైన సర్పంచ్ అన్నది తెలియక అధికారులు తలలు పట్టుకున్నారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిఈ ఘటన ఇప్పుడు రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారింది.

# రోగులకు నాణ్యమైన వైద్య సేవలు..

## సి.ఎం.సి. వేలూరు, చిత్తూరు క్యాంపస్ మధ్య పీపీపీ విధానంలో అవగాహన ఒప్పందం

అమరావతి, డిసెంబర్ 23: రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం చిత్తూరు కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సి.ఎం.సి. వేలూరు, చిత్తూరు క్యాంపస్ మధ్య పబ్లిక్‌ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో అవగాహన ఒప్పందం (ఎంఓఏ) కుదిరింది. ప్రభుత్వ తరఫున జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, సి.ఎం.సి. తరఫున డైరెక్టర్ డా. విక్రమ్ మ్యాథ్యూస్ ఒప్పందంపై సంతకాలు చేశారు.

ఈ ఒప్పందం ప్రకారం మిట్టూరు వార్డులోని ప్రభుత్వ పాత ప్రసూతి కేంద్రంలో సి.ఎం.సి. చిత్తూరు క్యాంపస్‌కు చెందిన వైద్యులను నియమించి అవుట్‌పేషెంట్ సేవలు, వైద్య సలహాలు, చికిత్స సమన్వయ సేవలను అందించనున్నారు. అలాగే పట్టణ పరిసరాల్లో సేవల లేమితో బాధపడుతున్న స్లమ్ ప్రాంతాలు, చేరుకోవడం కష్టమైన ప్రాంతాలకు మొబైల్ మెడికల్ యూనిట్ల ద్వారా వైద్య సేవలను విస్తరించనున్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ మాట్లాడుతూ పట్టణ ప్రాథమిక వైద్య సేవల ప్రమాణాలను మెరుగుపర్చే దిశగా ఇది ఒక నూతన ముందడుగని అన్నారు. ప్రజారోగ్య రంగంలో ఇలాంటి వినూత్న భాగస్వామ్యాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని, భవిష్యత్తులోనూ ఇలాంటి కార్యక్రమాలకు మద్దతు కొనసాగిస్తామని తెలిపారు.

అదేవిధంగా సి.ఎం.సి. డైరెక్టర్ డా. విక్రమ్ మ్యాథ్యూస్ మాట్లాడుతూ సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే సి.ఎం.సి. ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆ లక్ష్య సాధనలో ప్రభుత్వంతో కలిసి పనిచేసే అవకాశం లభించడం ఆనందకరమని చెప్పారు. పట్టణ ప్రాంతాల్లో వేగంగా పెరుగుతున్న డయాబెటిస్, హైపర్‌టెన్షన్ వంటి సంక్రమణ కాని వ్యాధులు (ఎన్‌సీడీలు) ప్రధాన ప్రజారోగ్య సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో ఈ భాగస్వామ్యం ఎంతో కీలకమని జిల్లా అధికారులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు సమయానుకూలంగా, అవసరానుగుణంగా చికిత్స అందడంతో పాటు నిరంతర వైద్య సంరక్షణకు మరింత భరోసా కలుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సుధారాణి, మున్సిపల్ కమిషనర్ నరసింహ ప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డా. లోకేష్, సి.ఎం.సి. చిత్తూరు క్యాంపస్ అసోసియేట్ డైరెక్టర్ డా. ఉదయ్ జకారియా, మెడికల్ సూపరింటెండెంట్ డా. ఐ. రాజేష్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. డోరోథీ లాల్, ఐసీఎంఆర్ ప్రాజెక్ట్ సైంటిస్ట్ డా. లోకేష్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.



# విశ్వ గురువు భారతదేశం..



అమరావతి, డిసెంబర్ 23:ప్రపంచానికి యోగ విద్యను పరిచయం చేసి విశ్వ గురువుగా భారతదేశం రాణిస్తున్న వేళ యోగ విశిష్టతను బహుళ ప్రయోజనాలను ప్రజలకు తెలియజేస్తూ.. బృహత్తర కార్యక్రమంలో 44 వ జాతీయ స్థాయి యోగాసనా ఛాంపియన్షిప్ 2025 ను జయప్రదం చేయాలని బాపట్ల నియోజకవర్గ శాసనసభ్యులు వేగేశ్న నరేంద్ర వర్మ రాజు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద 44వ జాతీయస్థాయి యోగాసనా ఛాంపియన్ గోడపత్రికలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలోని 26 రాష్ట్రాలకు చెందిన 16 విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ చూపించిన రాష్ట్ర స్థాయి ఛాంపియన్లు 600 మంది ఈ జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని రాష్ట్ర యువజన క్రీడా శాఖ మాత్యులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించనున్నారని తెలిపారు. 15 సంవత్సరాల తర్వాత ఆంధ్రప్రదేశ్ కు ఈ ఛాంపియన్షిప్ నిర్వహించే అవకాశం లభించిందని ఈ పోటీలకు బాపట్ల నియోజకవర్గంలో వేదిక కానుండటం హర్షణీయమని అన్నారు. బాపట్ల మండలం జిల్లెళ్ళమూడి విశ్వజననీ పరిషత్ ప్రాంగణంలో మూడు రోజులు పాటు జరిగే ఈ కార్యక్రమాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించునున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ప్రత్యేకంగా జిల్లెళ్ళమూడిలో ఏర్పాటు చేయనున్నట్లు గ్రామంలో పారిశుధ్యం మెరుగుపరిచి రోడ్లను పరిసరాలను అత్యంత పరిశుభ్రంగా ఉంచాలని గ్రామపంచాయతీ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఏపీ యోగా అసోసియేషన్ చైర్మన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కళ్ళం హరినాథ్ రెడ్డి, కార్యదర్శి అల్లాడి రవికుమార్, వివేకా సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళి కృష్ణ, ప్రముఖ ఆడిటర్ చాపల సుబ్రహ్మణ్యం, లైన్స్ క్లబ్ మాజీ అధ్యక్షులు శీలం శ్రీనివాసరావు, విశ్రాంత ఉపాధ్యాయులు వీరభద్రరావు, ప్రముఖ అబ్జర్వేషనల్ సైకాలజిస్ట్ పిన్నిబోయిన శ్రీమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

### -సర్పంచ్ వడుగురి శాంతాచిన్న బాపు ఉదారత

మంచిర్యాల, డిసెంబర్ 23: మండలంలోని జజ్జరవెల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన కొట్రంగి పద్మ ఇటీవల మృతి చెందింది. నిరుపేద కుటుంభం కావడంతో చలించి పోయిన గ్రామసర్పంచ్ వడుగురి శాంత చిన్నబాపు ఉపసర్పంచ్ కొట్రంగి రాజ్ కుమార్, బీ ఆర్ ఎస్ నేత లింగంపల్లి రాజశేఖర్ కలిసి గ్రామస్థుల సహకారంతో మృతురాలి కుటుంబానికి రూ.10 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం లో ఎవరికి ఏ ఆపద వచ్చినా ముందుండి తీరుస్తానని హామీ ఇచ్చారు. గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కరానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో బీ ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొట్రంగి రమేష్, తలండి అశోక్, ఎలాది రమేష్, తాళ్లపల్లి లక్ష్మణ్, మేరుగు ప్రసాద్, దుర్గం దసరయ్య, కుమార్ యువకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పూర్వ ప్రధానమంత్రి చౌధరీ చరణ్ సింగ్ గారి జయంతి.. ప్రధానమంత్రి నివాళులు

న్యూఢిల్లీ, డిసెంబర్ 23: పూర్వ ప్రధానమంత్రి, భారత్ రత్న చౌధరీ చరణ్ సింగ్ గారి జయంతి ఈ రోజు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఆయనకు నివాళులు అర్పించారు. "సమాజంలో ఆదరణకు నోచుకోని వర్గాల సంక్షేమం, వ్యవసాయ రంగ పురోగతి, రైతులకు సౌభాగ్యం .. ఈ ఆశయాల సాధనకు ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. దేశ నిర్మాణానికి ఆయన అందించిన సేవలను, కృతజ్ఞులైన దేశ ప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు" అని శ్రీ మోదీ అన్నారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రధానమంత్రి ఒక సందేశంలో "పూర్వ ప్రధానమంత్రి, భారత్ రత్న చౌధరీ చరణ్ సింగ్ గారికి ఆయన జయంతి సందర్భంగా గౌరవపూర్వక శ్రద్ధాంజలి. సమాజంలో వంచనకు గురైన వర్గాల వారి సంక్షేమం, వ్యవసాయ రంగ పురోగతి, రైతుల సమృద్ధి కోసం ఆయన తన జీవనాన్ని అంకితం చేశారు. దేశ నిర్మాణానికి ఆయన అందించిన సేవలను, కృతజ్ఞులైన దేశప్రజలు ఎన్నటికీ మరచిపోలేరు" అని పేర్కొన్నారు.

# రాష్ట్ర నెట్ బాల్ పోటీకి విద్యార్థిని ఎంపిక

నిజామాబాద్, డిసెంబర్ 23:నెట్ బాల్ క్రీడలో రాష్ట్రస్థాయికి విద్యార్థిని ఎంపికైంది. నిజామాబాద్ జిల్లా మాణిక్ బండార్ లోని పాఠశాలలో ఆదివారం జరిగిన నెట్ బాల్ క్రీడ టోర్నమెంట్ అండ్ సెలక్షన్ లో అత్యంత ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి నెట్ బాల్ క్రీడా పోటీలో జెడ్పిహెచ్ఎస్ కోన సమందర్ పాఠశాలకు చెందిన బి.వెన్నెల ( 9వ తరగతి )విద్యార్థిని ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. మధుపాల్, పి. డి రమేష్ గౌడ్ ఇవాళ తెలిపారు.

ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు మధు పాల్, గ్రామ వీడీసీ అధ్యక్షులు మెల్ల గంగాధర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులు, ఉపాధ్యాయుల బృందం వెన్నెలను అభినందించారు. ఈనెల 25, 26, 27 వ తేదీల్లో మహబూబాబాద్ లోని కేస సముద్రంలో జరిగే రాష్ట్రస్థాయి నెట్ బాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు పీడీ రమేష్ గౌడ్ తెలిపారు.

# ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి : తవిటి వెంకటమ్మ

నల్గొండ, డిసెంబర్ 23:పెండింగ్‌లో ఉన్న ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ఆశ వర్కర్ల యూనియన్ (సీఐటీయూ) నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి తవిటి వెంకటమ్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఆశ వర్కర్లు కట్టంగూర్ ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆశ వర్కర్లకు రూ.18 వేల కనీస వేతనం అందజేసి పీఎఫ్. ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఆశ వర్కర్లతో పారితోషకం లేని పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత యూడు సంవత్సరాల నుండి ఆశ వర్కర్లతో చేయించుకున్న లెప్రసీ సర్వే బిల్లులు నేటికి ఇవ్వలేదన్నారు.

ప్రభుత్వం ఆశ వర్కర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ సమన్వయ కమిటీ మండల కన్వీనర్ చెరుకు జానకి, ఆశ వర్కర్ల యూనియన్ మండల అధ్యక్షురాలు చౌగోని ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శి భూపతి రేణుక, శ్రామిక మండల కన్వీనర్ అబ్బగోని సంతోశ్, సబ్ సెంటర్ల లీడర్లు, ఆశ వర్కర్లు అంతటి పద్మావతి, రేణుక, పద్మ, సైదమ్మ, శోభ, భారతి, సుజాత, సోషల్ మీడియా కన్వీనర్ గడగోజు సుజాత పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ ప్రారంభం




నల్గొండ, డిసెంబర్ 23: ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్-2025 మంగళవారం నల్లగొండ పట్టణంలో ప్రారంభమైంది. ఉమ్మడి జిల్లాలోని 5 ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని విద్యార్థులు హాజరై వివిధ క్రీడాల్లో తలపడ్డారు. నల్లగొండ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహ్మారావు, జిల్లా యూత్ అండ్ స్పోర్ట్స్ అధికారి (డీఎస్ఈవో) ఎండీ.అక్బర్ అలీ జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల జీవితంలో క్రీడలు క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపినప్పుడే సంపూర్ణ వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందన్నారు. పోటీలు భవిష్యత్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో క్రీడాకారులను తయారు చేయడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. పోటీల్లో భాగంగా అథ్లెటిక్స్, వాలీబాల్, ఖో-ఖో, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటిన్, తదితర క్రీడా పోటీలు హోదా హోరీగా సాగాయి. ఈ కార్యక్రమంలో వివిధ పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపాల్స్ ఐలయ్య, సత్తయ్య, పీడీ ప్రసాద్, సైదులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, వివిధ విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు మాధురి, అంజయ్య, జ్యోతి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖపట్నంలో ఘనంగా ప్రారంభమైన పెసా మహోత్సవం



అమరావతి, డిసెంబర్ 23:విశాఖపట్నంలో రెండు రోజుల పాటు (23?24 డిసెంబర్ 2025) నిర్వహిస్తున్న పెసా మహోత్సవం ఈ రోజు (మంగళవారం) ఘనంగా ప్రారంభమైంది. పంచాయతీలు (షెడ్యూల్డ్ ఏరియాల విస్తరణ) చట్టం, 1996 (ఖఇూం) ప్రాముఖ్యతను చాటిచెప్పేలా నిర్వహిస్తున్న ఈ మహోత్సవం ప్రతిష్టాత్మక ఆర్.కే. బీచ్ వేదికగా నిర్వహించిన 'పెసా రన్'తో ఉత్సాహంగా మొదలైంది.

పెసా రన్ ను అర్జున అవార్డు గ్రహీత, ప్రముఖ భారతీయ ఆర్చర్ శ్రీమతి జ్యోతి సురేఖ వెన్నం ప్రారంభించగా.. ఇందులో అన్ని వయస్సుల వారు, ముఖ్యంగా గిరిజన యువత పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ముక్తా శేఖర్, ఏపీఎస్ఐఆర్డీ ఌ పీఆర్ కమిషనర్ శ్రీ ముత్యాల రాజు రేవు, పంచాయతీ రాజ్ ఌ గ్రామీణాభివృద్ధి కమిషనర్ మరియు డైరెక్టర్ శ్రీ వి.ఆర్. కృష్ణ తేజ మైలవరపు, అదనపు కమిషనర్ (పీఆర్) డా. ఎం. సుధాకర్ రావు, తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. వీరంతా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ, గ్రామ సభలను శక్తివంతం చేయడంలో, షెడ్యూల్డ్ ప్రాంతాల్లో గిరిజన సమాజాల హక్కులు, సముదాయ వనరులు, సాంస్కృతిక గుర్తింపును పరిరక్షించడంలో పెసా చట్టం పాత్రను వివరించారు.

పెసా రన్ అనంతరం, పెసా మహోత్సవాన్ని అధికారికంగా పంచాయతీ రాజ్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి ముక్తా శేఖర్, ఆర్థిక సలహాదారు డా. బిజయ్ కుమార్ బెహేరా, మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున పంచాయతీ రాజ్ ఌ గ్రామీణాభివృద్ధి కమిషనర్ మరియు డైరెక్టర్ శ్రీ వి.ఆర్. కృష్ణ తేజ మైలవరపు ప్రారంభించారు. అనంతరం రోజంతా పలు కార్యక్రమాలు నిర్వహించారు. క్రాఫ్ట్ బజార్, ఫుడ్ ఫెస్టివల్‌తో కూడిన ప్రదర్శన స్టాళ్లు గిరిజన హస్తకళలు, స్థానిక వంటకాలను ప్రదర్శించాయి. కబడ్డీ, విలువిద్య పోటీలు నిర్వహించగా, కబడ్డీ సెమీఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి.

మధ్యాహ్నం నుంచి వివిధ పెసా రాష్ట్రాల బృందాలతో నిర్వహించిన గిరిజన డెమో క్రీడలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చోలో, యేడు పెంకులాట, గేడి దౌడ్, రస కాశి, ఉప్పన్న బరెలు, పిథూల్, సికోర్, మల్లఖాంబ, చక్కీ ఖేల్ వంటి సంప్రదాయ ఆటలు ప్రదర్శిస్తూ, గిరిజనుల క్రీడా వారసత్వాన్ని ప్రదర్శించాయి.

అదే సమయంలో, అల్లూరి సీతారామ రాజు జిల్లా పరిధిలోని 10 పెసా గ్రామ పంచాయతీలలో గ్రామ సభలు నిర్వహించారు. గ్రామ సభల బలోపేతం, భూముల అక్రమ ఆక్రమణనల నివారణ, అటవీ ఉత్పత్తుల యాజమాన్యం, స్వల్ప స్థాయి ఖనిజాలపై నియంత్రణ, సముదాయ వనరులు, చిన్న నీటి వనరుల నిర్వహణ, మత్తు పదార్థాలు, మనీ లెండింగ్‌పై నియంత్రణ వంటి అంశాలతో పాటుగా ప్రాచీన గిరిజన ఆచార, సంప్రదాయాలు, సాంస్కృతిక గుర్తింపు పరిరక్షణ వంటి అంశాలపై చర్చలు జరిపారు.

ఈ ఉత్సవాలు బుధవారం (డిసెంబర్ 24) 'పెసా డే' ముగింపు వేడుకలతో ముగియనున్నాయి. రెండో రోజున సాంకేతిక సదస్సులు, గిరిజన కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనలు, క్రీడా పోటీల విజేతలకు బహుమతి ప్రదానోత్సవం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఈ వేడుకలు షెడ్యూల్డ్ ప్రాంతాల్లో భాగస్వామ్య పాలనను, గ్రామస్థాయి ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలనే సందేశాన్ని పునరుద్ఘాటిస్తున్నాయి.

# పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా చేపట్టాలి – కలెక్టర్ కుమార్ దీపక్

ఆదిలాబాద్, డిసెంబర్ 23: రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని, ఈ క్రమంలో కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని తాంసూర్ మండలం రేపల్లెవాడలో గల మహేశ్వరి కాటన్ జిన్నింగ్ మిల్లును సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిసిఐ ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. ఈసారి రైతుల సౌకర్యార్థం కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

రైతులు దళారీలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ సంవత్సరం క్వింటాల్ పత్తికి రూ. 8,110 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. అధిక దిగుబడి సాధించిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేసి ధ్రువీకరించుకోవాలని, పంట ఉత్పత్తి ఆధారంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయానికి కొనుగోలు కేంద్రాలకు నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని తీసుకువచ్చే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతాంగానికి న్యాయం జరిగేదాక పోరాటం ఆగదు : కేటీఆర్



నల్గొండ, డిసెంబర్ 23:కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన '420' హామీలను అమలు చేయలేక, ప్రజలకు ముఖం చూపించలేక సహకార ఎన్నికల నిర్వహణ నుంచి తప్పించుకుంటోందని కేటీఆర్ ధ్వజమెత్తారు. నల్లగొండ జిల్లాలో సర్పంచులు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఓటమి భయంతోనే కాంగ్రెస్ సర్కారు నామినేటెడ్ పద్ధతిలో 'సహకార' పదవులు నింపుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రైతులకు ఓటేసే అవకాశం ఇస్తే కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయయని అన్నారు. జిల్లా పరిషత్, మండల పరిషత్ ఎన్నికలను కూడా ప్రభుత్వం భయంతోనే వాయిదా వేస్తోందని విమర్శించారు.

కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తూ.. అర్జునుడు చిలుక కన్నును లక్ష్యంగా చేసుకున్నట్టు.. మన దృష్టి కూడా కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీల అమలుపైనే ఉండాలని కేటీఆర్ సూచించారు. ఎన్ని కేసులు పెట్టినా, జైలుకు పంపినా భయపడేది లేదని, నల్లగొండ, మహబూబ్‌నగర్ రైతాంగానికి న్యాయం జరిగే వరకు మన పోరాటం ఆగవద్దని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా మంత్రులకు సాగునీటిపై కనీస అవగాహన లేదని, అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తున్నారని ఎద్దేవా చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి, ఎమ్మెల్సీ మంకెన కోటిరెడ్డితోపాటు మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిషోర్ కుమార్, భూపాల్ రెడ్డి, రవీంద్ర కుమార్ నాయక్, చిరుమర్తి లింగయ్య, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు. వీరితోపాటు మాజీ ఎంపీ లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ కర్నే ప్రభాకర్, నాయకులు చెరుకు సుధాకర్, ఒంటెద్దు నరసింహారెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపారు.

# సరిహద్దులోనూ అక్రమ రవాణాను అరికట్టాలి : ఎస్పీ




ఆదిలాబాద్, డిసెంబర్ 23: సరిహద్దులోనూ అక్రమ రవాణాను అరికట్టాలని అదిలాబాద్ జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ పోలీస్ అధికారులకు సూచించారు. ఆదిలాబాద్ జిల్లా గాదిగూడ మండలంలోని పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. పోలీసుల గౌరవ వందనాలు స్వీకరించారు. పలు రికార్డులు పరిశీలిస్తూ వివరాలు తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్క నాటారు.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీసులు సక్రమమైన యూనిఫామ్ ధరించాలన్నారు. విధులలో నీతి, నిజాయితీ, క్రమశిక్షణ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాలను సందర్శిస్తూ వీపీవో విధానాన్ని అమలు చేయాలన్నారు. మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాలలో అక్రమ రవాణాలను అరికట్టేందుకు కృషి చేయాలని సూచించారు.

రాయితీ బియ్యం, గంజాయి, గుడుంబా తరలకుండా చూడాలని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్, ప్రజల రోడ్డు భద్రతా నియమావళిపై అవగాహన కల్పించాలని సూచించారు. బాధితుల సమస్యలు బాధ్యతగా పరిష్కరించాలని, కేసులు పెండింగ్‌లో ఉండకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఉట్నూర్ అదనపు ఎస్పీ కాజల్ సింగ్, ఎస్సై ప్రణయ్ కుమార్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జాప్యం లేకుండా కుల, ఆదాయ ధ్రువపత్రాలు జారీ చేయాలి : కలెక్టర్ ఇలా త్రిపాఠి



నల్గొండ, డిసెంబర్ 23: విద్యార్థులు ఉపకార వేతనాలు పొందేందుకు తాసీల్దార్లు జాప్యం లేకుండా కుల, ఆదాయ ధ్రువ పత్రాలను జారీ చేయాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఇందుకుగాను అవసరమైతే ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులన్నింటిని త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓ, ఆర్డీఓను ఆమె ఆదేశించారు. మంగళవారం నల్లగొండ జిల్లా కనగల్ మండల కేంద్రంలో పలు ప్రభుత్వ సంస్థలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ఎంపీడీఓ కార్యాలయంలో ప్రీ మెట్రిక్ ఉపకార వేతనాల పంపిణీపై వచ్చిన దరఖాస్తులు, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఎంపీడీఓ, తాసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ధ్రువపత్రాల కారణంగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని తెలుసుకుని కుల, ఆదాయ ధ్రువ పత్రాలను జారీ చేసేందుకు ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేసి తక్షణ చర్యలు చేపట్టాలని నల్లగొండ ఆర్డీఓ అశోక్ రెడ్డి, డీఈఓ భిక్షపతి ని ఆదేశించారు.

అనంతరం ఇందిరమ్మ ఇండ్లపై కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను త్వరగా పూర్తి చేసుకునేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల బిల్లులను సైతం వెంటనే చెల్లించాల్సిందిగా గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్‌ను ఆదేశించారు. ఆ తర్వాత కలెక్టర్ భవిత కేంద్రాన్ని తనిఖీ చేసి పనులు పూర్తికావడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు .ఈ సందర్భంగా విద్యార్థులతో ముఖాముఖి మాట్లాడి వారికి చాక్లెట్లను పంపిణీ చేశారు.

అనంతరం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి ఆరోగ్య కేంద్రానికి వస్తున్న రోగుల వివరాలను, సిబ్బంది, డాక్టర్ల అటెండెన్స్ రిజిస్టర్, ఓపి రిజిస్టర్ తో పాటు, ఆస్పత్రిలో అందుతున్న వైద్య సేవలు, పరికరాలు, తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో కలెక్టర్ వెంట గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్, జిల్లా టీబీ అధికారి డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి, డీఈఓ భిక్షపతి, తాసీల్దార్ పద్మ, ఎంపీడీఓ, కనగల్ సర్పంచ్ మురళి గౌడ్ ఉన్నారు.

# వీబీ-జీ రామ్ జీ పథకంను రద్దు చేయాలి

బెల్లంపల్లి, డిసెంబర్ 23: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం చట్టం (ఎంజీఎన్ఆర్ జీఏ)ను రద్దు చేసి వికసిత్ భారత్ రోజ్ గార్, ఆజీవికా హామీ మిషన్ గ్రామీణ్ ( వీబీ–జీ రామ్ జీ ) బిల్లు -2025ను కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టడాన్ని నిరసిస్తూ బెల్లంపల్లిలో సీపీఐ లీడర్లు నిరసన చేపట్టారు. సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలో రాస్తారోకో ధర్నా నిర్వహించారు.

ఈ సందర్భంగా పట్టణంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వీబీ–జీ రామ్ జీ పథకంపై కేంద్ర ప్రభుత్వంతీసుకున్న నిర్ణయానికి వ్యతిరేకంగా గాంధీ కూడలిలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి దాగం మల్లేష్, పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి మాట్లాడుతూ.. దేశంలో పేద ప్రజలకు పని లేక, తిండి లేక అనేక మంది ఆకలి చావులకు గురవుతున్న పరిస్థితుల్లో వాటికి చెక్ పెట్టాలనే ఉద్దేశంతో 2005లో అప్పటి ప్రధాని డా. మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు.

కమ్యూనిస్టు పార్టీల ఒత్తిడితోనే ఈ చారిత్రాత్మక పథకం అమలులోకి వచ్చిందని గుర్తుచేశారు. ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం, రాష్ట్ర ప్రభుత్వాలు 10 శాతం నిధులు సమకూర్చడం ద్వారా లక్షలాది పేద కుటుంబాలకు ఉపాధి లభించిందని, ఎంతోమంది ఆకలి చావుల నుంచి రక్షించబడ్డారని వారు పేర్కొన్నారు.

కేంద్రంలో పాలనసాగిస్తున్న బీజేపీ ప్రభుత్వం ఈ పథకాన్ని బలహీనపరిచి, కొత్త పేరుతో ప్రవేశపెట్టడం ద్వారా పేద ప్రజలకు తీవ్ర అన్యాయం చేస్తోందని విమర్శించారు. ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తూ ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరించి సంపన్నులను మరింత సంపన్నులుగా మార్చే విధానాలు అమలు చేస్తున్నదని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం ప్రజా కంటక ప్రభుత్వంగా మారిందని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కొత్త పథకాన్ని తక్షణమే రద్దు చేసి, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని అదే పేరుతో కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలంతా సంఘటితంగా ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరం ఉందని నాయకులు పిలుపునిచ్చారు.

ఈ నిరసన, ధర్నా కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శులు బొంతల లక్ష్మీనారాయణ, కొండ బానేష్, జిల్లా సమితి సభ్యులు తిలక్ అంబేద్కర్, డీఆర్ శ్రీధర్, రత్నం రాజం, బీకేఎంయు జాతీయ సమితి సభ్యుడు అక్కెపల్లి బాపు, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జాడి పోశం, లీడర్లు బొంకూరి రామచందర్, బియ్యాల ఉపేందర్, దాగం రాజలింగు, ప్రహలాద్, కృష్ణింగు హనుమంతు, పులి శంకర్, మహేందర్ రెడ్డి, సుధాకర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా చేపట్టాలి : కలెక్టర్ కుమార్ దీపక్



ఆదిలాబాద్, డిసెంబర్ 23: రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రక్రియ చేపట్టిందని, ఈ క్రమంలో కొనుగోలు ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని తాంసూర్ మండలం రేపల్లెవాడలో గల మహేశ్వరి కాటన్ జిన్నింగ్ మిల్లును సందర్శించి కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిసిఐ ద్వారా రైతుల వద్ద నుండి నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని కొనుగోలు చేసి రైతులకు మద్దతు ధర చెల్లిస్తుందని తెలిపారు. ఈసారి రైతుల సౌకర్యార్థం కపాస్ కిసాన్ యాప్ ద్వారా కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు.

రైతులు దళారీలను నమ్మి మోసపోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిసిఐ కొనుగోలు కేంద్రాలలో నిబంధనల ప్రకారం పత్తిని విక్రయించి మద్దతు ధర పొందాలని, ఈ సంవత్సరం క్వింటాల్ పత్తికి రూ. 8,110 మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని తెలిపారు. అధిక దిగుబడి సాధించిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద ఆన్ లైన్ లో వివరాలు నమోదు చేసి ధ్రువీకరించుకోవాలని, పంట ఉత్పత్తి ఆధారంగా కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని నిర్ణీత సమయానికి కొనుగోలు కేంద్రాలకు నిబంధనల ప్రకారం నాణ్యమైన పత్తిని తీసుకువచ్చే విధంగా అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

# 45 రోజులుగా రోడ్డు వేసి మరీ అక్రమంగా ఇసుక తవ్వకాలు..



మెదక్, డిసెంబర్ 23: మెదక్ మండలం సంగాయిగూడ తండా హల్దీ వాగులో అధికార పార్టీ నాయకులు రోడ్డు వేసి మరీ 45 రోజులుగా అక్రమంగా యధేచ్ఛగా ఇసుక తవ్వకాలు చేపడుతున్నారు. హల్దీ వాగు నుంచి ఇసుక తవ్వకాలు చేపడుతూ జహీరాబాద్, బీదర్, హైదరాబాద్‌కు తరలిస్తున్నారు.

ఈ క్రమంలో వాగులో క్వారీ ఏర్పాటు చేసుకున్న ప్రాంతాన్ని మాజీ డిప్యూటీ స్పీకర్, బీఅర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎం పద్మా దేవేందర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి పరిశీలించారు. వారి వెంట ఎమ్మెల్సీ యాదవ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, నాయకులు కంఠరెడ్డి తిరుపతి రెడ్డి, మెదక్ మండల పార్టీ అధ్యక్షుడు ఎం అంజ గౌడ్, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# 40వ వారానికి చేరుకున్న హనుమాన్ చాలీసా పారాయణం

దండేపల్లి, డిసెంబర్ 23: దండేపల్లి మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ప్రతి మంగళవారం నిర్వహించే హనుమాన్ చాలీసా పారాయణం ఈ రోజు 40వ వారానికి చేరుకుంది. స్థానిక హనుమాన్ దేవాలయంలో దండేపల్లి గ్రామానికి చెందిన పలువురు భక్తులు ఉదయం 6 గంటల నుండి ఏడు గంటల వరకు ప్రతివారం పారాయణం చేస్తున్నారు. దీనివల్ల గ్రామాల్లో ఆధ్యాత్మిక భావన పెంపులకు కృషి చేస్తున్నారు. స్థానిక హనుమాన్ దేవాలయ కమిటీ సభ్యులతో పాటు భక్తులు పాల్గొంటున్నారు.

# గొల్ల-కురుమ సర్పంచులకు మాజీ మంత్రి తలసాని సన్మానం



హైదరాబాద్, డిసెంబర్ 23: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో గెలుపొందిన గొల్ల, కురుమ సర్పంచులు, వార్డు సభ్యులను మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మంగళవారం బీబీనగర్‌లో శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముందుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు దూదివెట్ల బాలరాజు యాదవ్‌కు కళాకారులు, డప్పు చప్పుళ్లతో స్వాగతం పలికి ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు గ్రామాభివృద్ధి లక్ష్యంగా సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో గొర్ల కాపరుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండెబోయిన అయోధ్య యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి సోము రమేశ్ కురుమ, భువనగిరి మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ చీర ఐలయ్య, నాయకులు గూదే శ్రీశైలం, సర్పంచులు కొమిరె శ్రీకాంత్, ఏర్పుల నాగరాజు, డబ్బికార్ రాజేశ్వర్, హుస్సేన్, పెరబోయిన లక్ష్మీనారాయణ, దవాడి సత్యనారాయణ, చింతల రఘుపతి, పొట్టినగారి జగన్, అందె యాదగిరి, ఉప సర్పంచ్ దాబాటి బాల పోచయ్య, దొడ్డి రమేశ్ కురుమ, ఉగ్గి నరసింహ కురుమ, గూదె వెంకటేశం, సారాజి కొండల్ పాల్గొన్నారు.

# నమ్మి ఓటేసిన ప్రజలకు సేవ చేయండి : మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

నల్గొండ, డిసెంబర్ 23: గ్రామంలోని ప్రజలకు సేవ చేస్తారనే నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ సేవ చేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. మంగళవారం కోదాడలోని తన నివాసంలో మోతే మండలం హుస్నాబాద్ గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ఎన్నికైన అక్కినపల్లి శ్రీరాము, ఇతర వార్డు సభ్యుల ను ఆయన శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గ్రామంలోని సమస్యల ను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. అభివృద్ధిలో రాజీ పడవద్దని సర్పంచ్ చెక్ పవర్ ఉందని ఈ అంశంలో ఎవరికి తలవంచాల్సిన అవసరం లేదన్నారు. పార్టీలకతీతంగా గ్రామ అభివృద్ధికి తోడ్పడాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శీలం సైదులు, నాయకులు రవి జానారెడ్డి, సంజీవరెడ్డి, రామిరెడ్డి, గోవర్ధన్ రెడ్డి, విజయ్, సుధాకర్ పాల్గొన్నారు.

# హయత్‌నగర్‌లో విజయవాడ హైవే దిగ్బంధం.. వరుస యాక్సిడెంట్లపై స్థానికుల ఆగ్రహం




హైదరాబాద్, డిసెంబర్ 23: హైదరాబాద్‌లోని హయత్‌నగర్‌లో విజయవాడ హైవేపై స్థానికులు ఆందోళనకు దిగారు. ఇక్కడ తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ రహదారా మృత్యు మార్గామా అని ప్రశ్నిస్తూ ఫ్లకార్డులు, ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. ఇటీవల రోడ్డు దాటుతుండగా ఎంబీబీఎస్ విద్యార్థిని ఐశ్వర్య మరణించిన నేపథ్యంలో హైవేకి ఇరువైపుల ఉన్న కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. హైదరాబాద్ - విజయవాడ హైవేపై రోడ్డు దాటేందుకు వీలుగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు నిర్మించాలని డిమాండ్ చేశారు.

హయత్ నగర్ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డి, మన్సూరాబాద్ కార్పొరేటర్ నరసింహారెడ్డితో పాటు విజయవాడ హైవేకి ఇరువైపులా ఉన్న కాలనీల వాసులు ఈ ఆందోళనలో పాల్గొన్నారు. వారు హైవేని దిగ్బంధం చేయడంతో పెద్ద ఎత్తున వాహనాలు నిలిచిపోయాయి, భారీగా ట్రాఫిక్ జామ్ కావడంతో అక్కడకు వచ్చిన పోలీసులు.. నిరసనకారులతో మాట్లాడారు.

# ఆర్థిక సంస్కరణల దార్శనికుడు పీవీ

## – శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్




హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 23: ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా హనుమకొండ లోని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశానికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ఆర్థిక సంస్కరణల బాట పట్టించిన నాయకుడు పీవీ నర్సింహారావు అని అన్నారు. యువత పీవీ నర్సింహారావు జీవితం నుంచి క్రమశిక్షణ, సహనం, దేశభక్తిని నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నొడితల సతీష్‌కుమార్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ యూత్ రాష్ట్ర కార్యదర్శి పులి రజినీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవర్చుకోవాలి : క్యాట్కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలె వెంకటేశ్వర్లు

నల్గొండ, డిసెంబర్ 23: విద్యార్థి స్థాయి నుండే ప్రశ్నించే తత్వం అలవరుచుకోవాలని క్యాట్కో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏలె వెంకటేశ్వర్లు అన్నారు. మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని శాస్త్ర హై స్కూల్‌లో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించడం జరిగింది. స్కూల్ కరస్పాండెంట్ కె.కిశోర్ కుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో ప్రిన్సిపాల్ రమేశ్ సమన్వయకర్తగా వ్యవహరించారు. డిసిఐసి కన్వీనర్ చింతమల్ల గురవయ్య, వినియోగదారుల సంఘాల సమన్వయ కమిటీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు మట్టయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ.ముస్తఫా మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, బాధ్యతలు, ఫిర్యాదులు, పరిష్కారా మార్గాలు, ఆహార కల్తీలు, తూనికలు కొలతల్లో జరుగుతున్న మోసాలను వివరించారు. అనంతరం ఉపన్యాస పోటీల్లో విజేతలకు మెడల్స్, ప్రశంసా పత్రాలు అందజేశారు.

# పదోన్నతుల కోసం అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారు

## –చట్ట ప్రకారం నడుచుకోవాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుంది

## –డీజీపీ శివధర్‌రెడ్డిపై హరీశ్‌రావు ఫైర్

హైదరాబాద్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్);సీఎం రేవంత్‌రెడ్డి మెప్పుకోసం, పదోన్నతుల కోసం బీఆర్ఎస్ నేతలపై అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేస్తున్న కొందరు అధికారుల తీరుపై మాజీ మంత్రి హరీశ్‌రావు మండిపడ్డారు. ఒకరిద్దరు అధికారులు రేవంత్ రెడ్డిని ఖుషీ చేయడానికి, పదోన్నతుల కోసం అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులు పెడుతున్నారని విమర్శించారు. అధికారులు చేసే అతికి వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. ఏపీలో అధికారులకు ఏ గతి పట్టిందో మీకూ అదేగతి పడుతుందని అన్నారు. అధికారులు రేవంత్ రెడ్డి మెప్పు కోసం పనులు చేయవద్దని, చట్ట ప్రకారం నడుచుకోవాలని, లేదంటే తగిన మూల్యం చెల్లించాల్సి వస్తుందని హరీశ్‌రావు హెచ్చరించారు.

తాము గమనిస్తున్నామని, రికార్డు చేస్తున్నామని చెప్పారు. ఏ పోలీస్ అధికారి ఏం చేస్తున్నడో లెక్కలు రాస్తున్నామని తెలిపారు. అధికారుల అరాచకాలు, సెటిల్ మెంట్స్ అన్నీ తీస్తామని, వారు రిటైర్డ్ అయినా, విదేశాల్లో ఉన్నా, సెంట్రల్ సర్వీసెస్‌కు డిప్యూటేషన్ల మీద వెళ్ళినా తీసుకొస్తామని చెప్పారు.మీరు మీ పరిమితుల్లో ఉండాలని, ఏ కలుగులో దాక్కున్నా బయటకు తెస్తామని అధికారులను ఉద్దేశించి హరీశ్‌రావు వార్నింగ్ ఇచ్చారు. 'ఖాకీ బుక్ ఉన్నది ప్రజలకు న్యాయం చేయడానికి కాదా.. సీఎం రేవంత్ రెడ్డికి సేవ చేయడానికా..' అని ప్రశ్నించారు. 'మీ ఖాకీ బుక్ ఏం చేస్తుంది శివధర్ రెడ్డీ?' అని నిలదీశారు. 'పోలీసుల సమస్యలపై దృష్టి సారించు శివధర్ రెడ్డీ' అని సూచించారు. 'నాలుగు సరెండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉన్నాయి. నువ్వేం డీజీపీవి..' అని ఎద్దేవా చేశారు.ఎంతసేపు ఈయనకు నోటీసులు, ఆయనకు నోటీసులు పంపడమే నీ పనా.. అని డీజీపీ శివధర్‌రెడ్డిని ప్రశ్నించారు. రేవంత్ ఫుట్‌బాల్ ఆడుతుంటే అక్కడ నిలబడటమే నీ పనా.. అని మండిపడ్డారు. జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం ఒక్క మాదాపూర్ బెటాలియన్‌ను మాత్రమే ఎందుకు ఇచ్చావు.. అని నిలదీశారు. నేతి బీరకాయలో నెయ్యి ఎంత నిజమో.. నీ ఖాకీ బుక్‌లో రూల్స్ అంతే నిజం శివధర్ రెడ్డీ అని హరీష్ రావు చిట్ చాట్‌లో విమర్శించారు.

# ఆరోగ్య సంరక్షణ కేవలం ఆస్పత్రి గోడలకే పరిమితం కాకూడదు : స్టార్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గోపీచంద్




ఖమ్మం, డిసెంబర్ 23:ఆరోగ్య సంరక్షణ కేవలం ఆసుపత్రి గోడలకే పరిమితం కాకూడదని, వ్యాధి భారాన్ని తగ్గించే విషయంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని స్టార్ హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ గోపిచంద్ మన్నం అన్నారు. మంగళవారం నానక్‌రాం గూడలోని దవాఖానలో 'ది 2025 రియాలిటీ చెక్' పేరిట ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. చికిత్స కేవలం దవాఖానలకే పరిమితమ వ్వకూడదని, వ్యాధి భారాన్ని తగ్గించే ప్రయత్నంలో ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన బాధ్యత తీసుకోవాలన్నారు. వ్యాధి నివారణ, ముందస్తు గుర్తింపులపైనే ఆరోగ్యం ఆధారపడి ఉంటుందన్నారు. దవాఖాన వైద్య సిబ్బంది ప్రివెంటివ్ హెల్త్‌కేర్ ఫిలాసఫీని పునరుద్ఘాటించారు. వాతావరణంలో మార్పులు, జీవన విధానాలు, ఆహారపు అలవాట్లు, జెనిటిక్ సమస్యలు, ఒత్తిడి, స్వయం చికిత్స విధానాలు అనారోగ్యానికి ప్రధాన కారణాలవుతున్నాయని, ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు, వైద్య పరీక్షలతో ఆరోగ్యాన్ని పదిలంగా కాపాడుకోగలమన్నారు.

ఆరోగ్య సమస్యలు కేవలం ఒకటి, రెండు సంవత్సరాల కాలంలో రావని, దీర్ఘకాలంగా చిన్నచిన్నగా సమస్య తయారై, ఒక్కసారిగా బయటపడతాయన్నారు. 20 ఏండ్ల వయస్సు నుంచే జాగ్రత్తలు పాటించడం ఉత్తమమన్నారు. మధుమేహ వ్యాధిగ్రస్థ కుటుంబీకులు ఉంటే పిల్లలకు 10 ఏండ్ల వయస్సు నుంచే డయాబెటిక్ పరీక్షలు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు భరత్ కుమార్, గాందే శ్రీధర్, శ్రీనివాస్లు, శ్రీకాంత్ యెర్రం, రోహిణి కస్తూరి, సంతోష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# బంగ్లాలో అశాంతి వేల ..సకాలంలో బంగ్లాదేశ్‌లో ఎన్నికలు

## –బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ కీలక ప్రకటన

ఢాకా డిసెంబర్ 23 (ఎక్సం ప్రెస్ న్యూస్);ఇంఖిలాబ్ మంచ్ అధికార ప్రతినిధి ఉస్మాన్ హాదీ పై హత్య దరిమిలా బంగ్లాదేశ్ లో మరోసారి హింస చెలరేగిన విషయం తెలిసిందే. వేల సంఖ్యలో ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీంతో బంగ్లాలో అశాంతి నెలకొంది. ఈ నిరసనల వేళ బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ కీలక ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో ఎన్నికలు సకాలంలో జరుగుతాయని తెలిపారు. ఈ విషయాన్ని భారత్‌లోని అమెరికా దౌత్యవేత్త సెర్గియో గోర్ కు తెలియజేశారు.సెర్గియో గోర్‌తో యూనస్ ఫోన్‌లో సంభాషించారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 12న సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలనే తన నిబద్ధతను యూనస్ ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. మాజీ ప్రధాని షేక్ హసీనా పాలన గురించి ప్రస్తావిస్తూ.. నిరంకుశ పాలన సమయంలో దొంగలించిన తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని దేశ ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారని యూనస్ వ్యాఖ్యానించారు. 'హసీనా మద్దతుదారులు ఎన్నికల ప్రక్రియకు అంతరాయం కలిగించేందుకు మిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తున్నారు. దేశం విడిచి పారిపోయిన వారు హింసను ప్రేరేపిస్తున్నారు. ఎలాంటి సవాళ్లనైనా ఎదుర్కొనేందుకు ప్రభుత్వం పూర్తిగా సిద్ధంగా ఉంది. ఎన్నికలకు 50 రోజుల సమయం ఉంది. స్వేచ్ఛగా, న్యాయంగా, శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించాలనుకుంటున్నాము' అని సెర్గియోతో యూనస్ అన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వం దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాలలోపు బహిర్గతం చేయాలి

## – హైకోర్టు ఇచ్చిన తీర్పు ప్రభుత్వానికి చెంపపెట్టు హరీశ్ రావు

హైదరాబాద్ డిసెంబర్ 23 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );రాష్ట్ర ప్రభుత్వం దాచిపెట్టిన అన్ని జీవోలను నాలుగు వారాలలోపు బహిర్గతం చేయాలని, పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పు సోకాల్డ్ ప్రజా ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని మాజీ మంత్రి హరీశ్ రావు అన్నారు. రేవంత్‌రెడ్డి తనది ప్రజా ప్రభుత్వం అని చెప్పుకోవడం కాదని, చీకటి జీవోల మాటున దొంగచాటుగా ఏం చేస్తున్నాడో బహిర్గతం చెయాలని ఆయన ఎక్స్ వేదికగా డిమాండ్ చేశారు.ప్రజాపాలన అని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ జీవోలు దాస్తూ డ్రామాలు చేస్తున్నదని హరీశ్‌రావు విమర్శించారు. ఆర్టీఐ సమాధానం ఆధారంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్ హైకోర్టులో వేసిన పబ్లిక్ ఇంట్రెస్ట్ లిటిగేషన్ (ఖఎఒ) తో ఆ డ్రామాలు బయటపడబోతున్నాయని అన్నారు. 2023 డిసెంబర్ 7 నుంచి 2025 జనవరి 1 వరకు అంటే మొత్తం 13 నెలల్లో ప్రభుత్వం 19,064 జీవోలు జారీ చేసిందని, వాటిలో కేవలం 3,290 జీవోలు మాత్రమే పబ్లిక్ డొమైన్‌లో ఉంచడంలో అంతర్యం ఏమిటని ప్రశ్నించారు.ఒక్క ఏడాదిలో 15,774 జీవోలు అంటే 82 శాతం జీవోలను దాచిపెట్టి ప్రభుత్వం ఏం చేస్తున్నట్లని హరీశ్‌రావు నిలదీశారు. 'రేవంత్ రెడ్డీ ఇదేనా మీరు చెప్పుకుంటున్న ప్రజా ప్రభుత్వం' అని ప్రశ్నించారు.

# ఆర్థిక సంస్కరణల దార్శనికుడు పీవీ : శాసనమండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్




హనుమకొండ డిసెంబర్ 23:: ఆర్థిక సంస్కరణల దార్శనికుడు మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని శాసన మండలి వైస్ చైర్మన్ బండా ప్రకాశ్ అన్నారు. పీవీ నర్సింహారావు వర్ధంతి సందర్భంగా హనుమకొండ లోని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా బండా ప్రకాశ్ మాట్లాడుతూ.. క్లిష్ట పరిస్థితుల్లో దేశాన్ని స్థిరత్వం వైపు నడిపిన అపూర్వ మేధావి, బహుభాషా పండితుడిగా, పరిపాలనలో ఆయన తీసుకున్న నిర్ణయాలు చరిత్రలో చిరస్థాయిగా నిలిచా యన్నారు. తెలంగాణ బిడ్డగా దేశ ప్రధానిగా ఎదిగి, ప్రపంచ పటంలో భారతదేశానికి గౌరవం పెంచిన మహనీయుడని ఆయన సేవలు మరువలేనివని కొనియాడారు.

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని ఆర్థిక సంస్కరణల బాట పట్టించిన నాయకుడు పీవీ నర్సింహారావు అని అన్నారు. యువత పీవీ నర్సింహారావు జీవితం నుంచి క్రమశిక్షణ, సహనం, దేశభక్తిని నేర్చుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నొడితల సతీష్‌కుమార్, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, తెలంగాణ ముదిరాజ్ మహాసభ యూత్ రాష్ట్ర కార్యదర్శి పులి రజినీకాంత్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని పీవీ నర్సింహారావు విగ్రహానికి పూలమాలల వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

# బోటితండా సర్పంచ్‌కు తీవ్ర అస్వస్థత

ఖమ్మం,డిసెంబర్ 23:ఇటీవల జరిగిన గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కారేపల్లి మండలంలో స్వతంత్ర అభ్యర్థిగా ఏకగ్రీవమైన బోటితండా సర్పంచ్ భూక్య తులసీరామ్ తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. తులసీరామ్ సోమవారం గ్రామ పంచాయతీ సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అదే రోజు సాయంత్రం సమయంలో ఒక్కసారిగా అనారోగ్యానికి గురికావడంతో కుటుంబ సభ్యులు ఖమ్మం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. మెదడులో పక్షవాతం రావడంతో వైద్యుల సూచనతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తున్న కుటుంబ సభ్యులు తెలిపారు. నూతనంగా పదవీ బాధ్యతలు చేపట్టిన సర్పంచ్ సంపూర్ణ ఆరోగ్యంతో ఇంటికి తిరిగి రావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# కాకతీయ యూనివర్సిటీలో హాకీ సెలెక్షన్స్.. పాల్గొన్న క్రీడాకారులు

హనుమకొండ డిసెంబర్ 23: కాకతీయ యూనివర్సిటీలో హోరాహోరీగా యూనివర్సిటీ ఇంటర్ కాలేజీయేట్ హాకీ సెలక్షన్స్? జరిగాయి. యూనివర్సిటీ క్రీడామైదానంలో ఈ సెలెక్షన్స్ నిర్వహించారు. ఇందులో ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల నుంచి 40 మంది హాకీ క్రీడాకారులు పాల్గొన్నారని స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి ప్రొఫెసర్ వై వెంకయ్య తెలిపారు.

ఇందులో ఎంపికైన క్రీడాకారులు చెన్నైలోని సత్యభామ యూనివర్సిటీలో జరగబోయే సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ హాకీ టోర్నమెంట్‌లో పాల్గొంటారని చెప్పారు.

# బిహార్ సీఎం నితీష్ కుమార్ వైఖరిపై జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం కన్నెర్ర

## ముస్లిం డాక్టర్ హిజాబ్ తొలగించిన సీఎం నితీష్ కుమార్ ను పదవి నుండి తప్పించాల్సిందే

### నితీష్ కుమార్ సీఎం హోదాలో మహిళా లోకాన్ని ఘెరంగా అవమాన పరిచారు

### తెలంగాణ చౌక్ లో పెద్ద ఎత్తున జమాతే ఇస్లామి మహిళల నిరసన..

### పోలీసు స్టేషన్లో ఫిర్యాదు

కరీంనగర్, డిసెంబర్ 23: (నేటినిజం ప్రతినిధి) బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ ముస్లిం మహిళ డాక్టర్ అని చూడకుండా హిజాబ్ ను తొలగించడాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. మహిళా లోకానికి జరిగిన అవమానంగా పరిగణిస్తూ నగరంలోని తెలంగాణ చౌక్ లో, మంగళవారం జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ముస్లిం మహిళలు, యువతులు నిరసన చేపట్టారు. అనంతరం కరీంనగర్ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్లో సీఎం నితీష్ కుమార్ పై లిఖితపూర్వకంగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సయ్యదా సాజిదా బేగం, జిల్లా అధ్యక్షురాలు హాఫ్సా ఫాతిమా, గ్రామీణ అధ్యక్షురాలు అయేషా సుల్తానలు మాట్లాడుతూ.. సీఎం హోదాలో ఉన్నానని సోయి మరిచి నితీష్ కుమార్, చేసిన దౌర్భాగ్యపు పనికి ముస్లిం సమాజానికి, బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. డిసెంబర్ 15న సీఎం క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ ఆయుష్ వైద్యులకు నియామక పత్రాలను అందజేస్తున్న సమయములో ఆయుష్ డాక్టర్ గా నియమకమైన నుస్రత్ పర్వీన్ బుర్ఖాలో హిజాబ్ ధరించి వచ్చిన




డాక్టర్ ను, మహిళ అని చూడకుండా బలవంతముగా ఆమె ముఖముపై ఉన్న హిజాబ్ ను తొలగించి సీఎం హోదాలో నితీష్ కుమార్ చేసిన పని సభ్య సమాజం తలదించుకునేలా ఉందన్నారు. సీఎం హోదాకు నితీష్ కుమార్ కళంకం తీసుకొచ్చారని దీనిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కేంద్ర ప్రభుత్వం ముస్లిం మహిళల రక్షణకు ప్రత్యేకమైన చట్టం తీసుకు రావాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్ ఉభయ రాష్ట్రాల్లో జమాతే ఇస్లామి హింద్ మహిళా విభాగం సీఎం నితీష్ కుమార్ పై ఫిర్యాదులు చేస్తుందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సీఎం నితీష్ కుమార్ పై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని తెలంగాణ డిజిపికి, పోలీసు కమిషనర్ కు విజ్ఞప్తి చేశారు. సీఎం నితీష్ కుమార్, ముస్లిం మహిళలకు తక్షణమే క్షమాపణలు చెప్పకపోతే దేశవ్యాప్త ఆందోళనకు జమాతే ఇస్లామి హింద్ శ్రీకారం చుడుతుందని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో జమాతే ఇస్లామి జిల్లా అధ్యక్షుడు సోహెబ్ అహ్మద్ ఖాన్, జమాతే ఇస్లామి నగర నేత ఖైరోద్దీన్, ఎంపీజే జిల్లా అధ్యక్షుడు సాజిద్ ఖాన్, నగర ఎంపీజే అమ్మార్ లతిఫీ, ఎంపీజే మహిళా విభాగం నాయకురాళ్లు అయేషా సమ్రీన్, జరీనా తబస్సుమ్, ఆయేషా సిద్ధిఖ, జీనత్ ఫాతిమా, గౌసియా బేగం, అడ్వకేట్ అదీబా, జీఐవో విభాగం సుమయ్య తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి

## జాదవ్ గణేష్ కుమార్

ఆదిలాబాద్, డిసెంబర్ 23:విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి వార్షిక పరీక్షలకు సన్నద్ధం చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి జాదవ్ గణేష్ కుమార్ అధ్యాపకులకు సూచించారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి పలు వివరాలు తెలుసు కున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్ట పడి చదువుకొని వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని, ఇంటర్మీడియట్ లో 100% ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. అలాగే విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి పరీక్షలకు సన్నతం చేయాలని అధ్యాపకులకు ఆదేశించారు.

# ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు పత కాలు కైవసం

## -కరాటే ఆడపిల్లల ఆత్మ రక్షణకు ఆయుధం ప్రధానోపాధ్యాయులు బన్నాజీ



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 23:నేటినిజం ప్రతినిధి): పెద్ద పెల్లి జిల్లా రామగుండంలో ఆదివారం జరిగిన ఇంటర్ స్టేట్ కరాటే పోటీల్లో రాజన్న సిరిసిల్ల వేములవాడ పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ సత్తా చాటారు. ఈ పోటీల్లో కుమ్మితే, క టాస్ విభాగంలో ఈ పాఠశాలకు చెందిన విద్యార్థులు బొడుగే క్రాంతి కుమార్, ఈ. రోహిత్ బంగారు, కె. రిశ్వంత్ కాంస్య పత కాలు సాధించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బన్నాజి మాట్లాడుతూ కరాటే శారీరక దృఢత్వం పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని పేర్కొన్నారు.

ప్రతిభ చాటినందుకు విద్యార్థులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. బాలికలకు ఆత్మ రక్షణ కొరకు కరాటే శిక్షణ తరగతులు విద్యార్థులకు తప్పనిసరి అని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పొందుతున్న విద్య కరాటే అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బీ. కృష్ణా, సిహెచ్. యాదగిరి, పి, సత్యనారాయణ, సిహెచ్ అరుంధతి, కె సుచరిత, వ్యాయామ ఉపాధ్యాయుడు జి, రవీందర్రావు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆటో డ్రైవర్లకు ఆరోగ్య ధీమా

## -ఆరోగ్య భీమా కార్డులు అందజేసిన బీఆర్ఎస్ నేత చెల్మెడ

వేములవాడ, డిసెంబర్ 23: వైద్య విజ్ఞాన సంస్థ చైర్మన్, టిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చెల్మెడ లక్ష్మీనరసింహారావు ఆరోగ్య భీమా అందజేసి వారి కుటుంబాల్లో ఆనందాన్ని నింపారు. వేములవాడ నియోజకవర్గ పరిధిలో ఉన్న కోనరావుపేట, రుద్రంగి, చందుర్తి, వేములవాడ అర్బన్ రూరల్ మండలాలలో గల ఆటో డ్రైవర్ సోదరులకు ఆరోగ్య భీమా కార్డులను మంగళవారం స్వయంగా చెల్మెడ లక్ష్మీనరసింహారావు వారి చేతుల మీదుగా అందజేశారు. పట్టణంలోని మొదటి బైపాస్ రహదారుల గల శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహించిన ఆటో డ్రైవర్ సోదరులకు ఆత్మీయ భరోసా కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం 6 గ్యారంటీల అబద్ధపు ప్రచారాలతో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆటో డ్రైవర్ల ఉపాధికి అడ్డుకట్ట వేసిందన్నారం మహిళలకు ఉచిత బస్సు ఏర్పాటు చేసి ఆటో డ్రైవర్ల జీవనోపాధిని ఆగమ్య గోచరంగా మార్చడం జరిగిందని మండిపడ్డారు. ఆటో డ్రైవర్లు తమ ఆటోలకు నెల నెల వాయిదాలు కట్టడానికి కూడా కష్టం కావడంతో వారి కష్టాన్ని చూసిన తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గొప్ప ఆలోచనతో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఆటో డ్రైవర్లకు ప్రమాద భీమను ఉచితంగా పార్టీ తరఫున అందజేశారనీ గుర్తుచేశారు. ఇటీవల కేటీఆర్ తెలంగాణ భవన్ లో ఆత్మీయ భరోసా కార్యక్రమాన్ని నిర్వహించి పలువురు ఆటో డ్రైవర్ లకు కార్డులను గ్రూప్ ఇన్సూరెన్స్ చేసి అందజేశారన్నారు. దీనికి మరింత తోడ్పాటు అందించడమే కాకుండా నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్ సోదరుల ఆరోగ్యం బాగుండాలని దృఢ సంకల్పంతో చెల్మెడ వైద్య విజ్ఞాన సంస్థ ద్వారా వారికి జనరల్ హెల్త్ ఇన్సూరెన్స్ అందించి, ఆరోగ్య భీమాను చేసి ఆత్మీయ భరోసా పేరిట డ్రైవర్ సోదరులతో కార్యక్రమం నిర్వహించి కార్డులను అందజేశారు. ఆటో డ్రైవర్ అంటేనే విశ్వసనీయత కూడిన వ్యక్తిగా, మన కుటుంబ సభ్యుడిగా ఉన్న గొప్ప వ్యక్తి అని అన్నారు. వారికి నా వంతుగా ఆరోగ్య బీమా అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. వేములవాడ రాజన్న ఆలయానికి వచ్చే భక్తులకు ఒక గైడ్ గా వ్యవహరించి వారిని సురక్షితంగా రాజన్న ఆలయం వరకు తీసుకొచ్చే వ్యక్తి ఆటో డ్రైవర్ సోదరుడని, అలాగే వారు ప్రయాణం చేసే సమయంలో నగదు కానీ, సెల్ ఫోన్లు కానీ, ఇతర సామాన్లు ఏదైనా మర్చిపోతే వారికి తిరిగి ఇచ్చి నిజాయితీని కూడా చాటుకున్న ఘనత మన వేములవాడ ఆటో డ్రైవర్లదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ ఆటో యూనియన్ అధ్యక్షులు బొల్లి రామ్మోహన్, జిల్లా అధ్యక్షులు ఆలె శ్రీనివాస్, బిఆర్టియు అధ్యక్షులు వెంగళ శ్రీనివాస్, ఏనుగు




మనోహర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, రామతీర్థపు రాజు, నిమ్మ శెట్టి విజయ్, మారం కుమార్, సిరిగిరి చందు, నరాల శేఖర్, జోగిని శంకర్, మండల అధ్యక్షులు గోస్కుల రవి, మల్యాల దేవయ్య, నాయకులు నీలం శేఖర్, కొండ కనకయ్య, మాదాడి గజానందరావు వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, ముద్రకొల వెంకటేశం, అంజద్ పాషా, ఉమర్, రఫీ, సుంకపాక రాజు, ఆటో డ్రైవర్లు తదితరులు ఉన్నారు.

# గ్రామాభివృద్ధికి బీజేపీ తప్పకుండా సహకరిస్తుంది..

## -తిమ్మాపూర్ బీజేపీ మండల అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరా చారి.



కరీంనగర్, డిసెంబర్ 23: (నేటినిజం ప్రతినిధి) గ్రామాల అభివృద్ధి కి సంబంధించి బీజేపీ తప్పకుండా సహకరిస్తుందని తిమ్మాపూర్ బీజేపీ అధ్యక్షులు సుగుర్తి జగదీశ్వరా చారి పేర్కొన్నారు.మోదీ గిఫ్ట్ పేరిట 10 వ తరగతి విద్యార్థులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ ఉచితంగా అందిస్తున్న సైకిల్ లను మంగళవారం మొగిలిపాలెం విద్యార్థులకు అందించారు.స్థానిక జడ్పి పాఠశాల హెచ్ఎం నర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా 15 మంది విద్యార్థులకు సైకిల్ లను అందించారు. అంతకుముందు బస్టాండ్ చౌరస్తా లో గ్రామస్తులంతా కలిసి సామూహిక వందేమాతరం గీతాలాపన కార్యక్రమం నిర్వహించారు.ముఖ్య అతిథిగా హాజరైన బీజేపీ మండల అధ్యక్షులు మాట్లాడుతూ 10 వ తరగతి విద్యార్థులకు పరీక్ష ఫీజులు చెల్లించి పేద కుటుంబాలకు ఆర్థికంగా అండగా ఉన్నారని తెలిపారు.గ్రామ అభివృద్ధి కోసం కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిధులను నేరుగా గ్రామ పంచాయతీలకు పంపిస్తున్నదని పేర్కొన్నారు.మొగిలిపాలెం అభివృద్ధి కి బీజేపీ తప్పకుండా సహకరిస్తుందని, ప్రజలు ఆదరించాలని పేర్కొన్నారు. వందేమాతరం గేయం రచించి 150 సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సామూహిక వందేమాతర గీతాలాపన కార్యక్రమం వల్ల ఆనాటి పోరాట యోధుల త్యాగాలు నేటి తరానికి తెలుస్తున్నాయని అన్నారు. గ్రామ అభివృద్ధిలో సంబందించి కేంద్ర మంత్రి సహకారంతో పాటుగా రాష్ట్ర ప్రభుత్వ సహకారం అవసర మని,ఉచిత సైకిల్ ల పంపిణి కార్యక్రమం భవిష్యత్ కూడా జరగాలని స్థానిక సర్పంచ్ తాట్ల తిరుపతి కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మేకల అనిల్, జిల్లా ఓబీసీ మోర్చా కార్యదర్శి ఎర్రోజు లక్ష్మణ్, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు పాశం రాఘవ రెడ్డి,దళిత మోర్చా అధ్యక్షుడు ఎల్కపెల్లి స్వామి, బూత్ కమిటీ అధ్యక్షులు వరుకొలు రాజయ్య, సాయిల్ల అరవింద్,సీనియర్ నాయకులు పాశం వీర రాఘవరెడ్డి,గర్రెపెల్లి యాదగిరి, జవ్వాజీ శ్రీనివాస్, పాడె అనిల్,మండల నాయకులు బుర్ర శ్రీనివాస్, రేగూరి సుగుణాకర్, బుడిగె మహేష్, శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# స్టెలాంటిస్ ఇండియా మరియు ముస్కాన్ ఫౌండేషన్




హైదరాబాద్, డిసెంబర్ 23: హైదరాబాద్లో 'సేఫ్ జర్నీ' రోడ్ సేఫ్టీ కార్యక్రమాన్ని ప్రారంభించాయి భారతదేశంలో ప్రతి సంవత్సరం 1,60,000కు పైగా రోడ్డు ప్రమాద మరణాలు నమోదవుతున్నాయి. తెలంగాణలో 2023లో 7,660 మంది, 2024లో 7,281 మంది రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారు. ఈ నేపథ్యంలో కుటుంబాలు మరియు యువతలో మరింత సురక్షిత రోడ్డు ప్రవర్తనకు దోహదపడే సాంస్కృతిక మార్పును తీసుకురావడమే ఈ ప్రచారం లక్ష్యంగా పెట్టుకుంది. ఆరు ప్రభుత్వ కళాశాలల్లో సమగ్ర రోడ్డు భద్రతా విద్యా కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారు. ఇందులో అవగాహనా సెషన్లు, వ్యవస్థబద్ధమైన శిక్షణ, మరియు అత్యవసర ప్రతిస్పందన వర్క్‌షాప్‌లు ఉన్నాయి. కళాశాల విద్య కమిషనరేట్‌తో అధికారిక అవగాహన ఒప్పందం ఓనీజ కింద రోడ్ సేఫ్టీ క్లబ్‌లను సంస్థాగతంగా ఏర్పాటు చేశారు. దీని ద్వారా విద్యార్థుల నేతృత్వంలో నిరంతర కార్యక్రమాలు కొనసాగించడానికి మరియు దీర్ఘకాలిక కార్యక్రమ యాజమాన్యాన్ని సాధించడానికి వీలు కలుగుతుంది.1,200 మందికి పైగా విద్యార్థులు మరియు అధ్యాపకులను నేరుగా భాగస్వాములుగా చేర్చడం లక్ష్యంగా ఉండగా, సహ విద్యార్థుల నేతృత్వంలోని అవగాహన కార్యక్రమాలు మరియు క్లబ్ కార్యకలాపాల ద్వారా 10,000 మందికి పైగా ప్రజలపై సానుకూల ప్రభావం చూపాలని ఈ కార్యక్రమం ఆశిస్తోంది. హైదరాబాద్, 18 డిసెంబర్ 2025: స్టెలాంటిస్ ఇండియా, రోడ్ సేఫ్టీ కోసం ముస్కాన్ ఫౌండేషన్‌తో భాగస్వామ్యంగా హైదరాబాద్‌లో 'సేఫ్ జర్నీ' ప్రచారాన్ని ప్రారంభించింది. ఇది మరింత సురక్షిత రవాణా వ్యవస్థలను నిర్మించాలన్న తన నిబద్ధతను మరింత బలపరుస్తోంది. ఈ కార్యక్రమం విద్యార్థులు, విద్యావేత్తలు మరియు స్థానిక అధికారులను ఒక వేదికపైకి తీసుకువచ్చి, రోడ్డు భద్రతపై అవగాహనను దీర్ఘకాలిక సామాజిక చర్యగా మార్చడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కార్యక్రమం ఈ వారం ప్రారంభమై హైదరాబాద్‌లోని ఆరు ప్రభుత్వ కళాశాలల్లో అమలు చేయబడుతోంది. వీటిలో నయాపుల్, బేగంపేట, నాంపల్లి, విద్యానగర్, ఖైరతాబాద్ మరియు గోల్కొండలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఈ సెషన్ల ద్వారా 1,200 మందికి పైగా విద్యార్థులు మరియు అధ్యాపకులను భాగస్వాములుగా చేర్చడం లక్ష్యంగా ఉండగా, సహ విద్యార్థుల నేతృత్వంలోని కార్యకలాపాలు మరియు అవగాహన వర్క్‌షాప్‌ల ద్వారా 10,000 మందికి పైగా సమాజ సభ్యులపై ప్రభావం చూపుతుందని ఆశిస్తున్నారు.

# ఏషియన్ పెయింట్స్ 'అపెక్స్ అల్టిమా ప్రొటెక్' క్యాంపెయిన్




హైదరాబాద్, డిసెంబర్ 23:వాతావరణ పరిస్థితులు ఏడాది పొడవునా ఇళ్లను సవాలు చేస్తున్న సమయంలో ఏషియన్ పెయింట్స్ తన కొత్త 'అపెక్స్ అల్టిమా ప్రొటెక్' క్యాంపెయిన్‌ను ప్రారంభించింది. భారతదేశపు చెస్ దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గుకేష్ దొమ్మరాజులతో కూడిన ఈ బ్రాండ్ సైన్స్, వ్యూహం, కథ చెప్పడంలో మిళితం చేసి దాని తాజా పురోగతిని హైలైట్ చేస్తుంది. గ్రాఫేన్ శక్తితో కూడిన ఇది మూడు అంశాలను వినూత్నంగా పరిచయం చేస్తోంది. ఈ కొత్త యాడ్ ఫిల్మ్‌లో ఆనంద్, గుకేశ్ ఇద్దరూ సరదాగా మేథస్సుతో కూడిన చెస్ పోరులో కనిపిస్తారు. వీరి సంభాషణ ద్వారా గ్రాఫిన్ టెక్నాలజీతో శక్తివంతమైన అపెక్స్ అల్టిమా ప్రొటెక్ ఎలా గ్రాండ్ మాస్టర్ ఆఫ్ టఫ్ ప్రొటెక్షన్ వని చేస్తుందో చూపిస్తున్నారు. ఎలా ఒక గ్రాండ మాస్టర్ ముందుగానే ప్రతి అడుగును అంచనా వేసి గెలుస్తాడో, అదే విధంగా అపెక్స్ అల్టిమా ప్రొటెక్ కూడా కఠినమైన వాతావరణ మార్పులను ముందే అంచనా వేసి ఇళ్లను బలంగా రక్షించడానికి రూపొందించబడింది. ఈ పెయింట్ వాడిన గృహ యజమానులకు నిరంతర రక్షణ, నమ్మకం, దీర్ఘకాలం భరోసా లభిస్తాయి. 'గ్రాఫిన్' ఆధునిక శాస్త్రంలో అత్యంత బలమైన, వైవిధ్యమైన పదార్థాల్లో ఒకటి. ఈ ఉత్పత్తి లామినేషన్ సిస్టమ్‌ను మరింత దృఢంగా చేస్తోంది. దీంతో అపెక్స్ అల్టిమా ప్రొటెక్ట్ దక్షిణ భారత ఇళ్లకు బాహ్య గోడల రక్షణలో కొత్త ప్రమాణాలు సృష్టించింది. 12 సంవత్సరాల వని తీరు వారంటీతో వచ్చే ఈ పెయింట్ వర్షం, ఎండ, తేమ, ధూళి వంటి కఠిన వాతావరణ పరిస్థితులకు అత్యుత్తమ ప్రతిఘటనను అందిస్తుంది. ఈ ప్రచారం చెస్‌లో రక్షణ కోసం అవసరమైన వ్యూహాత్మక మేధస్సును దక్షిణ భారత ఇళ్లకు అవసరమైన తెలివైన రక్షణతో పోలుస్తూ చూపిస్తుంది. ఈ సందర్భంగా ఏషియన్ పెయింట్స్ ఎండీ, సీఈఓ అమిత్ సింగల్ మాట్లాడుతూ ఆవిష్కరణ అనేది ఏషియన్ పెయింట్స్‌లో మనం రూపొందించే ప్రతి ఉత్పత్తికి మూలమన్నారు. గ్రాఫిన్ ఆధారిత రక్షణ వైపు అడుగు వేయడం, ఎక్స్‌టీరియర్స్ విభాగంలో ఒక పెద్ద ముందడుగు అన్నారు. విశ్వనాథన్ ఆనంద్, గుకేష్ దొమ్మరాజులు ఈ క్యాంపెయిన్‌లో చెస్ బోర్డు నుంచి మీ ఇల్లు గోడల వరకు 'స్ట్రాటజిక్, ఇంటెలిజెంట్ డిఫెన్స్' అనే ఆలోచనకు ప్రాణం పోసే విధంగా కాన్సెప్ట్‌ను రూపొందించామన్నారు. పర్ఫెక్ట్ మూవ్‌ను సృష్టించేందుకు ముగ్గురు గ్రాండ్‌మాస్టర్లు ఒకే వేదికపైకి వచ్చినట్లు ఈ కమ్యూనికేషన్ సూచిస్తుందని తెలిపారు.

# బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాల విద్యార్థినికి అభినందన




కరీంనగర్, డిసెంబర్ 23: (నేటినిజం ప్రతినిధి) నగరంలోని ఆర్టీసీ వర్క్ షాపు, సూర్య నగర్ లో గల బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాలలో విద్యను అభ్యసించిన విద్యార్థిని పి. అరుణకు ప్రభుత్వ కళాశాలలో బీఎస్సీ నర్సింగ్ విభాగంలో సీటు పొందింది. ఈ సందర్భంగా బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాల కరస్పాండెంట్ మహమ్మద్ అబ్దుల్ ఖుద్దుస్ విద్యార్థిని పి.అరుణ ను పూల బొకే, శాలువాతో అందించి అభినందించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ అబ్దుల్ ఖుద్దూస్ మాట్లాడుతూ బ్లూమింగ్ ఒకేషనల్ కళాశాలలో చదివే విద్యార్థులకు, ప్రత్యేకమైన శ్రద్ధతో విద్యను బోధించడం వల్లే ఇక్కడ చదివిన విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వ కళాశాలలో ఉచిత సీట్లు పొందగలు గుతున్నారని చెప్పారు ఒకేషనల్ విద్యపై ప్రజల్లో ఉన్న అపోహలను, బ్లూమింగ్ కళాశా లలో చదివిన అరుణ పటాపం చలు చేసి ప్రభుత్వ సీటు పొంద డం కళాశాలకు గర్వకారణం అన్నారు. భవిష్యత్తులో అరుణ ప్రభుత్వ ఉద్యోగం సాధించి, ఉన్నత శిఖరాలను అధిరోహించాలని తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు.

# హంసిణి, ధార్మిక స్కూల్స్‌లో నరసింహ చిత్ర ప్రదర్శన



రాజన్న సిరిసిల్ల, డిసెంబర్ 23:నేటినిజం (ప్రతినిధి): నేటి మన దేశమ్ ప్రతినిధి వేములవాడ పట్టణంలోని హంసిణి, ధార్మిక స్కూల్స్ లో యానిమేషన్ చిత్రం ' మహా అవతార్ నరసింహ' ను మంగళవారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా స్కూల్ క్యాంపస్ లోని సెమినార్ హాల్ లో మూవీ షో ఏర్పాటు చేయగా, పాఠశాలల పిల్లలు ఆసక్తిగా వీక్షించారు. ఈ సందర్భంగా స్కూల్ కరెస్పాండెంట్ నరాల సంతోష్ మాట్లాడుతూ ఈ మూవీ షోను సోమవారం, మంగళవారం ప్రదర్శించడం జరిగిందని, పిల్లలలో మానసిక ప్రశాంతత కొరకు ఈ సినిమా ప్రదర్శన చేపట్టడం జరిగిందని తెలిపారు.ఇలాంటి కార్యక్రమాలు పిల్లలలో ఒత్తిడి తగ్గి చదువుపై శ్రద్ధ పెడతారని అన్నారు. ప్రతిరోజు పిల్లలకు అన్నినీటికన్నా ఉత్తమమైనవి ఇవ్వాలని తాపత్రయ పడుతూనే ఉంటామని, దీనికి సహకరిస్తున్న తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు, టీచర్లు పాల్గొన్నారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com